▶ **డ్రగ్స్ కేసులో వైద్యుడి అరెస్టు**
- వైద్య పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ
- మరో ముగ్గురి నుంచి శాంపిల్స్ సేకరణ
- రిపోర్టు ఆధారంగా చర్యలు
- ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి



- వివరాలు మెయిన్‌లో

ఓపెన్‌గా భూ దందా

మొన్న మధురవాడ, ఇప్పుడు కోటనరవ జీవీఎంసీ 88వ వార్డు పరిధిలో ఓపెన్‌స్పేస్ ధారాదత్తం

వైసీపీ హయాంలో ప్రతిపాదన
- కూటమి హయాంలో ఆమోదం
- ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ వెనుక 12 ఎకరాల భూమి
- అందులో లేఅవుట్ వేసేందుకు కూటమి నేత ప్రణాళిక
- ఆ భూమికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలుకు ఒప్పందం
- ఆ భూమి ముందున్న ఓపెన్‌స్పేస్‌లో 180 గజాలు ఇస్తే తమ భూమిలో అంతే స్థలం జీవీఎంసీకి బదలాయిస్తామంటూ రైతు ద్వారా దరఖాస్తు
- ఈ ఏడాది మార్చిలో భూ మార్పిడికి ప్రభుత్వం అనుమతి





కోటనరవ ఓపెన్‌స్పేస్ వెనుక ఉన్న భూములు. (ఇన్‌సెట్‌లో) ఓపెన్‌స్పేస్‌లో ఏర్పాటుచేసిన బోర్డు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖలో పార్కులు /ఓపెన్‌స్పేస్‌లను గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేస్తున్నారు. వాటి వెనుక భూములు కలిగి వున్నవారు స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా పైరవీలు చేసుకుని విలువైన జీవీఎంసీ భూమిని చేజిక్కించుకుంటున్నారు. తద్వారా రహదారి సదుపాయం లేక నిరుపయోగంగా ఉన్న తమ భూములకు విలువ పెంచుకుని భారీగా లబ్ధిపొందుతున్నారు. మధురవాడ జోన్-2 బటర్‌ఫ్లై పార్కులోని 489 గజాల జీవీఎంసీ స్థలాన్ని ప్రైవేటువ్యక్తికి బదలాయించిన విషయం ఇటీవల బయటపడగా, తాజాగా 88వ వార్డు పరిధిలో జీవీఎంసీకి చెందిన ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాలను ప్రైవేటు భూమికి రహదారి నిర్మాణం నిమిత్తం బదలాయించిన విషయం వెలుగులోకి వచ్చింది. దీని వెనుక కూడా కూటమికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి చక్రం తిప్పారని ప్రచారం జరుగుతోంది.

జీవీఎంసీ జోన్-6 పరిధి కోటనరవలో సర్వే నంబరు 10-9బిలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోసం 1981లో లేఅవుట్ వేశారు. లేఅవుట్‌లోని ప్లాట్లన్నింటిలోనూ భవన నిర్మాణాలు జరిగిపోయాయి. లేఅవుట్ మధ్య కోటనరవ నుంచి షీలానగర్ వెళ్లే రోడ్డు ఉంది. ఆ రోడ్డును ఆనుకుని సుమారు 450 గజాలను ఓపెన్‌స్పేస్ కింద విడిచిపెట్టారు. ఆ స్థలం ఇప్పటికీ ఖాళీగానే ఉంది. అందులో ఆక్రమణలు జరగడంతో పెందుర్తి తహశీల్దార్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఇదిలావుండగా లేఅవుట్‌కు ఉత్తరం వైపు సుమారు 20 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. రైతులు ఆ భూముల్లోకి వెళ్లాలంటే ఓపెన్‌స్పేస్‌కు తూర్పు వైపున గల ఇళ్ల కోసం నిర్మించిన పది అడుగుల రహదారి ఒక్కటే మార్గం. ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌తోపాటు నరవ-షీలానగర్ రోడ్డును ఆనుకుని ఉన్న స్థలాలన్నీ అభివృద్ధి చెందాయి. లేఅవుట్‌కు ఉత్తరభాగంలో ఉన్న వ్యవసాయ భూములు కూడా నివాసాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుకూలంగా ఉన్నప్పటికీ రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఖాళీగా ఉండిపోయాయి. లేఅవుట్‌లో ఓపెన్‌స్పేస్‌గా కేటాయించిన స్థలంలో కొంతభూమిని తీసుకుని ప్రస్తుతం ఉన్న పది అడుగుల రోడ్డును 40 అడుగులకు విస్తరిస్తే వ్యవసాయ భూముల్లో బహుళ అంతస్థుల ... మిగతా 6వ పేజీలో

ఏయూ కేంద్రంగా డ్రగ్స్ రాకెట్!



తరచూ వర్సిటీ పరిసరాల్లోనే పట్టుబడుతున్న కొకైన్

నగరంలో పెరుగుతున్న వినియోగం
- గంజాయితో పాటు కొకైన్, హెరాయిన్
- ఢిల్లీ, బెంగళూరు నుంచి విమానం, కొరియర్ ద్వారా దిగుమతి
- నిబంధనలకు విరుద్ధంగా మత్తుకలిగించే మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపుల నిర్వాహకులు
- తాజా ఘటనలతో నగరవాసుల్లో ఆందోళన

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరం డ్రగ్స్ వినియోగం, సరఫరాకు కేంద్రంగా మారుతోంది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి విమానాలు, కొరియర్ సర్వీసుల ద్వారా దిగుమతి చేసుకుని విక్రయించే వారి సంఖ్య పెరుగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఈ వ్యవహారాల్లో కొన్ని మాత్రమే వెలుగుచూస్తుండగా, గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్నవి ఎన్నో. ఇక ఏజెన్సీ నుంచి గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతుండడంతో మైనర్లు కూడా మత్తుకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారు.

- 'ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో 25 గ్రాములు కొకైన్‌తో నగరానికి చెందిన యువకుడితోపాటు దక్షిణాఫ్రికా వాసిని ఈనెల 5న త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో ఢిల్లీ నుంచి విమానంలో కొకైన్‌ను తీసుకువచ్చినట్టు తేలింది.'



- 'గోపాలపట్నం సమీపంలోని మందులదుకాణంలో టాస్క్‌ఫోర్స్, ఔషధ నియంత్రణ మండలి అధికారులు ఈనెల ఐదున దాడిచేశారు. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తుకలిగించే మందులను విక్రయిస్తున్నట్టు తేలడంతో దుకాణం సీజ్‌చేసి నిర్వాహకులపై కేసు నమోదుచేశారు.'
- 'ఇటీవల హైదరాబాద్ నుంచి ఓ యువతి ట్రావెల్స్ బస్సులో ఎండీఎంఏ పౌడర్, ట్యాబ్‌లెట్లను నగరానికి తీసుకువస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. విచారణలో మర్రిపాలేనికి చెందిన యువకుడు హైదరాబాద్ నుంచి తరచూ దిగుమతి చేసుకుంటున్నట్టు తేలింది.'

అత్యంత ఖరీదైన కొకైన్, హెరాయిన్,ఎండీఎంఏ పౌడర్, బోల్ట్ వంటి సింథటిక్ డ్రగ్స్‌తో పాటు మత్తు మందులను యువత ఏస్థాయిలో వినియోగిస్తున్నారనేదానికి పైన పేర్కొన్న ఉదాహరణలు అద్దంపడుతున్నాయి. తరచూ ఎక్కడో ఒకచోట గంజాయి, డ్రగ్స్ పోలీసులకు పట్టుబడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వసంస్థలతో పాటు ఐటీ కంపెనీలు, జాతీయస్థాయి విద్యాసంస్థలు ఉండడంతో దేశ, విదేశాల యువత చేరుతున్నారు. ఇండియన్‌నేవీ, కోస్ట్‌గార్డ్, వైజాగ్‌పోర్టు, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థల్లో ఉద్యోగాలకు వివిధ ప్రాంతాల వారు వచ్చి నివసిస్తున్నారు. దీంతో కాస్మోపాలిటన్ సంస్కృతి పెరుగుతోంది. ఈ క్రమంలోనే యువత కొకైన్, హెరాయిన్, ఎండీఎంఏ పౌడర్, ఎండీఎంఏ బోల్ట్స్ (ట్యాబ్‌లెట్) వంటి సింథటిక్ డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఇక ఏజెన్సీ నుంచి గంజాయి దిగుమతి అవుతుండడంతో మైనర్లు కూడా బానిసలుగా మారడంతో వారిలో నేర ప్రవృత్తి పెరుగుతోంది. అత్యవసర అనారోగ్యపరిస్థితిలో వైద్యుల సూచన మేరకు ... మిగతా 6వ పేజీలో

శేష పాన్పుపై జగన్నాథుడు



మహారాణిపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జగన్నాథ స్వామి శేషపాన్పుపై భక్తులకు దర్శనమిచ్చారు. టర్నర్‌చౌల్ట్రీ కల్యాణ మండపంలో బలభద్ర, సుభద్ర సమేతంగా కొలువుదీరిన స్వామిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తొలి ఏకాదశి పర్వదినంతో పాటు సెలవు రోజు కావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు, అర్చనలు చేశారు. దశావతారాలు ముగియడంతో సోమవారం ఉదయం 9.30 గంటలకు స్వామి వారిని రథం పైకి చేర్చి భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం మారు రథయాత్ర నిర్వహించనున్నారు.

తీరంలో కోలాహలం..!



సందర్శకులతో కిటకిటలాడుతున్న ఆర్‌కే బీచ్

తీరం జనసంద్రమయింది. ఆదివారం కావడంతో సందర్శకులతో నిండిపోయింది. ఆర్‌కే బీచ్ నుంచి భీముని పట్నం వరకు అన్ని ప్రాంతాల్లో సందడి వాతావరణం కనిపించింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు తెరిపినివ్వడంతో కుటుంబాలతో సహా తీరానికి చేరుకున్నారు. సముద్రంలో స్నానాలు చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపారు.

\- బీచ్‌రోడ్డు, ఆంధ్రజ్యోతి

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు

- జాయింట్ కమిషనర్, అసిస్టెంట్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు స్థాన చలనం



విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లాలోని వాణిజ్య పన్నులశాఖలో పలువురు అధికారులకు బదిలీలు జరిగాయి. జాయింట్ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు స్థానం చలనం కలిగింది. విశాఖపట్నం-2 జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్‌కు నెల్లూరు బదిలీ అయింది. అనంతపురం జాయింట్ కమిషనర్ టి.శేషాద్రిని విశాఖపట్నం-2 జాయింట్ కమిషనర్‌గా బదిలీచేశారు. ఈయనకే విశాఖపట్నం-1 పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విశాఖపట్నం డివిజన్-1 పరిధిలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్‌వీ రవికాంత్ చిక్కాకు రాజమహేంద్రవరం, విశాఖ-2 డివిజన్‌లో పనిచేస్తున్న అపర్ణ కొంపల్లికి విజయవాడ-1, విజయవాడ చీఫ్ కమిషనర్ ఆఫీస్‌లో పనిచేసే డేవిడ్ అనిల్‌కుమార్‌కు విశాఖలోని వ్యాట్ ట్రిబ్యునల్ స్టేట్ రిప్రజెంటేటివ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న వై.వెంకటేశ్వర్లును విజయవాడలోని చీఫ్ కమిషనర్ ఆఫీస్‌కు, విశాఖపట్నం డివిజన్-2 అనకాపల్లి సర్కిల్‌లో పనిచేస్తున్న దుశ్యంత్ కుమార్‌కు విశాఖపట్నం-1 సూర్యాబాగ్ సర్కిల్‌కు, ఎయిర్‌పోర్టు సర్కిల్‌లో పనిచేస్తున్న పంతుల నారాయణశాస్త్రికి గుంటూరు-2 డివిజన్ పిడుగురాళ్ల సర్కిల్‌కు, గాజువాక సర్కిల్‌లో పనిచేస్తున్న మలిశెట్టి వెంకటేశ్వర్లును విజయనగరం వెస్ట్ సర్కిల్‌కు, అచ్యుతాపురం సర్కిల్‌లో పనిచేసే దుర్గాసి శ్వేతను విజయనగరం సౌత్ సర్కిల్‌కు, విశాఖ డివిజన్-1లోని పి.కృష్ణారావును అనకాపల్లి సర్కిల్‌కు, చినవాల్తేరు సర్కిల్‌లోని బీజీఎస్ ప్రసాదరావును కురుపాం మార్కెట్‌కు, డాబాగార్డెన్స్ సర్కిల్‌లోని వులవకాయల నూకరాజును మాధవధార సర్కిల్‌కు బదిలీచేశారు. కురుపాం మార్కెట్ సర్కిల్‌లో రత్నాల అనసూయకు ఏలూరు బజార్‌సర్కిల్‌కు, సిరిపురం సర్కిల్‌లోని ఉడతా శ్రీనివాసులును నిడదవోలు సర్కిల్‌కు బదిలీ చేశారు. ద్వారకానగర్ సర్కిల్‌లోని కేవీ లక్ష్మీప్రసన్నకు కాకినాడ డివిజన్ జగన్నాయక్‌పూర్, సూర్యాబాగ్‌లో పనిచేసే దుల్లా సాంబశివరావును పాలకొల్లు సర్కిల్‌కు బదిలీ చేశారు. వీరితోపాటు 32 మంది డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు బదిలీలయ్యాయి.

తెరపైకి ఫ్రీ హోల్డ్

- వైసీపీ హయాంలో 609 ఎకరాలకు అనుమతి
- 126 ఎకరాలకు పూర్తైన రిజిస్ట్రేషన్లు
- మరో మూడు వేల ఎకరాలకు దరఖాస్తులు పెండింగ్
- ఏడాదిగా కొనసాగుతున్న ఆంక్షలు
- గ్రామీణ ప్రాంతాల్లోని భూములకే అవకాశం

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

గడువుదాటిన డీపట్టా భూములకు స్వేచ్ఛ కల్పించేందుకు ప్రభుత్వం విధించిన ఆంక్షలు తొలగిపోయాయి. ఏడాదిగా ఫ్రీ హోల్డ్‌భూముల వ్యవహారం పూర్తిగా నిలిపివేసిన ప్రభుత్వం, తాజాగా అనుమతిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్‌కు అర్హత కలిగిన భూములకు మోక్షం లభించనున్నది.

భూమిలేని నిరుపేదలకు సుమారు 50 ఏళ్ల క్రితం అప్పటి పాలకలు డీపట్టాలు ఇచ్చారు. రైతులు ఈ భూముల్లో వ్యవసాయం లేదా తోటలు పెంచుకుని జీవించాలి. వారసత్వంగా



రామవరంలో ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ పొందిన భూములు

కుటుంబసభ్యులు సాగుచేసుకోవచ్చు. క్రయవిక్రయాలకు అవకాశం లేదు. ఈ నేపథ్యంలో నగరానికి ఆనుకుని వందలాది డీపట్టా భూములు అమ్మకాలు జరిగినా అధికారికంగా ఎవరికీ హక్కులు దఖలుపడలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దలు, వారి అనుయాయులు ఈ డీపట్టా ... మిగతా 6వ పేజీలో

భక్తిశ్రద్ధలతో మొహర్రం



సత్యం, ధర్మం, సహనానికి ప్రతీకగా షియా ముస్లింలు ఆదివారం రక్తం చిందించారు. వన్‌టౌన్ చెంగళరావుపేట హుస్సైనీ మసీదు ఆధ్వర్యంలో యువకులు నల్లని దుస్తులు ధరించి బ్లేడ్లతో శరీరంపై కొట్టుకొని రక్తం చిందిస్తూ ర్యాలీ చేశారు. హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌ను స్మరిస్తూ మొహర్రం జరుపుకుంటామని అధ్యక్ష, కార్యదర్శులు హసీమ్ హుస్సైన్, రాజా ఆగా తెలిపారు.

\- మహారాణిపేట, ఆంధ్రజ్యోతి

టమాటా ధరకు రెక్కలు

- వారం రోజుల్లో రూ.12 పెరిగిన ధర
- రైతుబజార్లలో కేజీ రూ.34
- బహిరంగ మార్కెట్లో రూ.50



నరసింహనగర్ రైతుబజారులో విక్రయానికి సిద్ధంగా టమాటా

అక్కయ్యపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

టమాటా ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. రైతు బజార్లలో వారం రోజుల కిందట కేజీ ధర రూ.22 ఉండగా ప్రస్తుతం రూ.34కి చేరింది. ఇక బహిరంగ మార్కెట్లలో కేజీ రూ. 50 పలుకుతోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు టమాటా నిత్యావసరం. ఇప్పటికే కూరగాయల ధరలు పెరుగుతుండగా, టమాటా ధరతో జనం గగ్గోలు పెడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా టమాటా పంటకు నష్టం సంభవించిందని,ఈనేపథ్యంలో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. నగరంలోని హోల్‌సేల్ మార్కెట్‌కు మదనపల్లి నుంచి టమాటా వస్తుంది. అక్కడ 25 కిలోల క్రేట్ రూ.850 ధర పలుకుతోంది, రవాణా ఖర్చులు కలిపితే మరింత భారమని, కేజీ రూ.34కి విక్రయించినా నష్టమే వస్తోందని రైతుబజార్లలోని స్టాల్స్ నిర్వాహకులు వాపోతున్నారు.

విమ్స్‌లో సదరం పరీక్షలు

- లోకో మోటార్ కేటగిరీ బాధితులకు నిర్వహణ



విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సదరం శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రస్తుతం కేజీహెచ్‌తోపాటు మిగిలిన బోధనాస్పత్రుల్లో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నారు. కాగా విమ్స్‌లో లోకో మోటార్ కేటగిరీ (శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారికి) పరీక్షలు నిర్వహిస్తారు. స్లాట్ బుక్ చేసుకునే వారు ఇకపై విమ్స్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం ఆర్థో విభాగానికి చెందిన వైద్యులను విమ్స్ అధికారులు కేటాయిం చారు. శిక్షణ పొందిన నలుగురు సిబ్బందిని కూడా నియమించారు. ప్రతి మంగళవారం క్యాంపులు నిర్వహించనున్నామని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.

వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన



సింహాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణతులసీ దళార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు.ప్రతి నెలలో వచ్చే రెండు ఏకాదశి పర్వదినాల్లో ఆర్జిత సేవగా స్వర్ణ తులసీ దళార్చన చేస్తారు. ఈమేరకు వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీదేవి, భూదేవి సమేతంగా శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదేవేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు.

నేడు కృష్ణమయ్య జయంతి

సింహాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సోమవారం ప్రథమాంధ్రా వచన సంకీర్తనాచార్యులు కాంతా కృష్ణమాచార్యులు (కృష్ణమయ్య) జయంతి జరగనుంది. ఏటా ఆషాడ మాసం శుక్లపక్ష ద్వాదశినాడు కృష్ణమయ్య జయంతి నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఉదయం బేడా మండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

చందనం సమర్పణకు రూ. లక్ష విరాళం

సింహాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామికి పైపూతగా సమర్పించే చందనం నిమిత్తం విజయవాడకు చెందిన కేవీఎల్ హరనాథ్, సరిత దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం నగదు రూపంలో ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్‌కు ఆదివారం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

బంగారు సంపెంగ కానుక

అనకాపల్లి జిల్లా సిరసపల్లి గ్రామానికి చెందిన అల్లవరపు త్రిమూర్తి దంపతులు అప్పన్న సేవలకు వినియోగించాలని కోరుతూ బంగారు సంపెంగ పువ్వును కానుకగా సమర్పించారు. 17.5 గ్రాముల బరువు కలిగిన స్వర్ణ సంపెంగను దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావుకు ఆదివారం వారు కానుకను అందజేసి స్వామివారి సేవల్లో వినియోగించాలని అభ్యర్థించారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

86 కిలోల చందనం అరగదీత

సింహాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఈనెల 9న పైపూతగా తుది విడత చందనం సమర్పించనున్నారు. ఈమేరకు రెండు రోజుల్లో ఆలయ సిబ్బంది మొత్తం 86 కిలోల చందనాన్ని అరగదీశారు. తొలిరోజు 36 కిలోలు, రెండవ రోజైన ఆదివారం 50 కిలోల చందనం అరగదీశారు. అరగదీసిన చందనపు ముద్దను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి పద్మనిధిలో భద్రపరిచారు.

350 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీపాలెంలో ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సేవాభావంతో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం వైద్యులు 350 మందిని పరీక్షించి, మందులు అందించారు. కార్యక్రమంలో ఉమా నారాయణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బమ్మిడి తారక్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బమ్మిడి ఉమ, మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

సాగర్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సాగర్‌నగర్‌లోని అల్లూరి సీతారామరాజు కూడలిలో బీజేపీ 8వ వార్డు అధ్యక్షుడు గరికిన ఎల్లాజి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పల్లవి మోహన్‌రావు, అచ్చుతరావు, వీవీ సుబ్బరాజు, అంకమ్మరావు, నాగేశ్వరరావు, రుక్మిణి పాల్గొన్నారు.

కొమ్మాది : జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎంపాలెంలో బీజేపీ నాయకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు రాజు, ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రమోద్ చక్రవర్తి, నాగరాజు, పెండ్యాల శ్రీనివాసరావు, చంద్రశేఖర్, రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ కేంద్రంగా డ్రగ్స్ రాకెట్!

... 5వ పేజీ తరువాయి

వినియోగించాల్సిన మత్తు మందులను దుకాణాల నుంచి కొనుగోలు చేసి, వినియోగిస్తున్న వారి సంఖ్యా పెరుగుతోంది. మెడికల్ షాపుల యజమానులు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండానే విచ్చలవిడిగా విక్రయించేస్తున్నారు.

విమానం, కొరియర్ ద్వారా దిగుమతి

నగరానికి చెందిన యువత ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లినపుడు అక్కడ డ్రగ్స్ వినియోగించేవారు, సరఫరా చేసేవారితో పరిచయం పెంచుకుంటున్నారు. వారితో ఒప్పందం కుదుర్చుకుని డ్రగ్స్ కొనుగోలుచేస్తున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపి, కొరియర్ ద్వారా దిగుమతి చేసుకుంటున్నారు. మరికొందరు ఏజెంట్ల ద్వారా విమానంలో దిగుమతిచేసుకుంటున్నారు. తాజాగా త్రీటౌన్ పోలీసులు ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో అనుమానాస్పదంగా ఉన్న కారుని చుట్టుముట్టారు. అందులోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని వేర్వేరుగా విచారించగా ఢిల్లీ నుంచి దక్షిణాఫ్రికాకు చెందిన వ్యక్తితో 25 గ్రాముల కొకైన్‌ను విమానంలో రప్పించామని నిందితుడు అక్షయ్ వివరించాడు. పోలీసులకు పట్టుబడిన దక్షిణాఫ్రికా జాతీయుడు తనకేమీ తెలియదని, ఒక వ్యక్తి కొంత డబ్బు ఇస్తానని, విశాఖ వెళ్లి ఒకరికి అందజేయాలనడంతో వచ్చానన్నాడు. అయితే అక్షయ్ పలుమార్లు ఢిల్లీ నుంచి కొకైన్ తెప్పించుకున్నట్టు పోలీసుల విచారణలో తేలడంతో లోతుగా విచారిస్తున్నారు. రామాటాకీస్ వద్దగల కొరియర్ ఏజెన్సీలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు డ్రగ్స్ ప్యాకెట్ గుర్తించి, విచారణ జరిపి యువకుడిని అరెస్ట్‌చేశారు. బెంగళూరు నుంచి వచ్చిన ట్రావెల్స్ బస్సులో కొకైన్‌ను పంపించగా, నగరానికి చెందిన రౌడీషీటర్ రామ్‌కిషోర్ దానిని తీసుకెళుతుండగా ఇంటెలిజెన్స్, త్రీటౌన్ పోలీసులు పట్టుకుని రూ.4.5 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో మరో ముగ్గురిని అరెస్ట్‌చేసి వారి వద్ద 24.5 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఏయూ కేంద్రంగానే ....

నగరంలో డ్రగ్స్, గంజాయి వినియోగిస్తున్నవారిలో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే అధికం. వీరంతా ఏయూలోని స్నేహితుల ద్వారా దందాను సాగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. నగరంలో డ్రగ్స్, గంజాయి పట్టుబడిన సందర్భాల్లో తరచూ ఏయూ ప్రస్తావన రావడం దీనికి బలాన్ని చేకూర్చుతోంది. కొన్నాళ్ల కిందట ఏయూలో ఆకస్మికసోదాలు నిర్వహించగా ఓ హాస్టల్‌లో గంజాయి లభ్యమైంది. ఇంజనీరింగ్ మైదానం విశాలంగా ఉండడం, హాస్టళ్ల సముదాయంలో రాత్రివేళ అంధకారం నెలకొనడం గంజాయి, డ్రగ్స్ సేవించేవారికి అడ్డాగా మారిందనే విమర్శలున్నాయి. బీచ్‌రోడ్డుతోపాటు శివారులోని ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల పరిసరాల్లోనూ డ్రగ్స్ వినియోగం పెరిగిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నగరవాసులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

స్వచ్ఛంద సంస్థలకు పూర్తి సహకారం

- ఈఓ వేంద్ర త్రినాథరావు
- స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

సింహాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామి తుది విడత చందనోత్సవం, గిరి ప్రదక్షిణలో భక్తులకు సేవలందించే స్వచ్ఛంద సంస్థలకు దేవస్థానం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో పోలీసు అధికారులతో కలిసి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటిలాగే భక్తులు నడిచే మార్గంలోనే స్టాల్స్ ఏర్పాటు చేయడానికి అనుమతి ఇస్తామన్నారు. సంస్థలు సరకు రవాణాకు బైక్‌లను మాత్రమే వినియోగించాలని ఇతర వాహనాలకు అనుమతి ఉండదని గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కాగా సేవా సంస్థల ప్రతినిధులు తమ వాహనాల రాకపోకలకు పాసులు జారీ చేయాలని కోరగా అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో దేవస్థానం ఈఈ వెంకటరమణ, ఏఈఓలు ఆనందకుమార్, రమణమూర్తి పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణులు


భీమిలిలోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో లక్ష తులసి పూజ

కొమ్మాది, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున తోమాల సేవ నిర్వహించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధర్ స్వామి మాట్లాడుతూ ఆషాడంలో వచ్చే ఏకాదశిని శయన ఏకాదశి అంటారని, ఈరోజు నుంచి స్వామివారు నాలుగు నెలలు యోగనిద్రలో ఉంటారని చెప్పారు. సాయంత్రం మహిళా మండలి ఆధ్వర్యంలో విశేష పారాయణలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్‌లోని పలు ఆలయాల్లో ఏకాదశి పూజలు నిర్వహించారు. ఇస్కాన్ మందిరం,సాగరేశ్వరాలయం, రుషికొండ టీటీడీ ఆలయం, బీచ్‌లో ఉన్న శివాలయం, గుడ్లవానిపాలెం ముత్యాలమ్మ భూలోకమ్మ, పోలమాంబ అమ్మవార్ల ఆలయం, పెద్ద రుషికొండ పోలమాంబ ఆలయాలకు వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి పూజలు జరిపారు.

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పలు ఆలయాల్లో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.మానం ఆంజనేయనగర్‌లోని లలిత త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. నగరంపాలెం రోడ్డులోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని పూలతో అలంకరించారు. స్వతంత్రనగర్‌లోని షిర్డీసాయి ఆలయం, మిథిలాపురి వుడాకాలనీ కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.

భీమునిపట్నం : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకుడు రొంపిచెర్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా కాలనీ వెంకటగిరిపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరాలయం, మినీ స్టేడియం వద్ద ఉన్న ఐశ్వర్య వేంకటేశ్వరాలయంలో ఉదయం పది గంటల నుంచి స్వామివారికి లక్ష తులసి పూజ జరిపారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాల్లో అర్చకులు అప్పలాచార్యులు, శేషాచార్యులు, ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, పుశిరికల బంగార్రాజు, హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతుని క్షేత్రంలో...

పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనాభుని క్షేత్రంలో తొలి ఏకాదశి సందర్భంగా విశేష అర్చనలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. అలాగే కుంతీమాధవస్వామి, అనంత పద్మనాభుడి మూలవిరాట్టులకు పంచామృతాభిషేకాలు, విశేష హోమాలు నిర్వహించారు. కొండపై ఉన్న అనంతుడిని, గిరి కింద ఉన్న కుంతీమాదవస్వామిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

ఘనంగా జగన్నాథుడి మారు రథయాత్ర


రథయాత్రలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జగన్నాథస్వామి మారు రథయాత్ర వైభవంగా జరిగింది. గత నెల 26వ తేదీ నుంచి రథోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రథయాత్ర మరుసటి రోజు నుంచి ఇంద్రజ్యుమ్న మందిరంలో స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం శేషశయన అవతారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడి విగ్రహాలను భక్తుల జయజయధ్వానాలతో రథం వద్దకు తొడ్కొని వచ్చారు. ఆలయ ప్రధానార్చకులు రొంపిచెర్ల లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు, ఎగ్జిక్యూటివ్ అథారిటీ సింగరాచార్యులు ఆధ్వర్యంలో మారు రథోత్సవం ప్రారంభమైంది. భక్తులు రథాన్ని లాగుతూ జగన్నాథస్వామికి జేజేలు పలుకుతూ ఊరేగించారు. ఇంద్రజ్యుమ్న మందిరం నుంచి కన్యకాపరమేశ్వరి వీధి, నెహ్రూ వీధి, గంట స్తంభం, మెయిన్‌రోడ్, పాతబస్టాండ్, చిన్నబజారు జంక్షన్ మీదుగా జగన్నాథుడి ఆలయం వరకూ రథయాత్ర సాగింది. కార్యక్రమంలో అల్లం రామకృష్ణ, అర్చకులు కృష్ణమాచార్యులు, సునరాపు కామేశ్వర మాధవశాస్త్రి, సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు, షైలపల్లి షణ్ముఖరావు, ముక్కామల కామేశ్వరరావు, యెచ్చర్ల హరి, ముమ్మిడిశెట్టి సత్యానందరావు, ఎంవీ పార్వతీశం పాల్గొన్నారు.

తుది శ్వాస వరకు కాంగ్రెస్‌లోనే ఉంటా

మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు


కప్ప స్తంభం వద్ద బాపిరాజు దంపతులు

సింహాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు.గోదాదేవి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నానని, తన తుది శ్వాస వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని చెప్పారు.

'కార్మికులు తప్పుడు ప్రకటనలు నమ్మరాదు'

తగరపువలస, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లులో పని చేసిన కార్మికులకు పరిహారాలు అందించే విషయంలో కొన్ని సంఘాలు తప్పుతోవ పట్టిస్తున్నాయని మిల్లు లాకౌట్ బాధితుల సంఘం ఆరోపించింది. ఆ సంఘం సభ్యులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. లాకౌట్ ప్రకటించడం చట్టరీత్యా చెల్లదని యాజమాన్యంపై తాము కోర్టులో కేసు వేసి పోరాటం చేస్తున్నామని,ఈ పరిస్థితుల్లో యాజమాన్యంతో ఒప్పందాలు చేసుకోవడం సరికాదన్నారు. 2009లో మిల్లు మూతపడిపోయిన తర్వాత ఏ సంఘానికి ఎన్నికలు జరగలేదని, కానీ కొన్ని సంఘాలు పాత హోదాతో యాజమాన్యంతో చర్చలు జరపడం సరికాదని చెప్పారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

కొమ్మాది, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా చంద్రంపాలెం పశువుల ఆస్పత్రిలో ఆదివారం 86 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనుపమ మాట్లాడుతూ కుక్కల పెంపకందారులకు జునోసిస్ వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. జునోసిస్ పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు వచ్చే వ్యాధి అని, అందులో 200లకు పైగా రోగాలు ఉంటాయని తెలిపారు.

భీమునిపట్నం : భీమిలి పశువైద్య శాలలో సహాయ సంచాలకుడు డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన పెంపుడు శునకాల యజమానులకు జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

అయినాడలో 'తొలి అడుగు'

పద్మనాభం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని అయినాడ గ్రామంలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కురిమిన లీలావతి ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర కోశాధికారిగా అప్పలరాజు

పద్మనాభం,జూలై 6 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ సెల్ (హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర విభాగం కోశాధికారిగా రెడ్డిపల్లి అప్పలరాజు నియమితులయ్యారు. ఈమేరకు హెచ్‌ఆర్‌సీ జాతీయ అధ్యక్షుడు కె. రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అప్పలరాజు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా, సాయి సంహిత ట్రస్టు అధ్యక్షుడిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

తీరంలో పర్యాటకుల సందడి

సాగర్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్, రుషికొండ బీచ్‌లు సందర్శకులతో ఆదివారం సందడిగా కనిపించాయి. గత వారం వర్షాల వల్ల రెండు బీచ్‌లు వెలవెలబోయాయి. ఈ వారం వర్షాలు తగ్గుముఖం పట్టడం, వాతావరణం చల్లగా ఉండడంతో సందర్శకులు పోటెత్తారు.


సందర్శకులతో కిటకిటలాడుతున్న రుషికొండ బీచ్

గిరి ప్రదక్షిణలో ట్రాఫిక్ ఆంక్షలు

సింహాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9, 10వ తేదీల్లో జరిగే సింహగిరి ప్రదక్షిణ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. 9న ఉదయం 6 నుంచి 10న సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.

- సత్తరువు కూడలి నుంచి అడివివరం కూడలి వరకు భక్తుల వాహనాలను అనుమతిస్తారు.అక్కడి నుంచి హనుమంతువాక కూడలి వైపునకు వాహనాలను అనుమతించరు.
- గోపాలపట్నం పెట్రోల్ బంక్ కూడలి నుంచి పాతగోశాల కూడలికి ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- పెందుర్తి, పినగాడి మీదుగా వేపగుంట కూడలిలో భారీ వాహనాలకు అనుమతి లేదు.
- ఎన్ఏడీ కూడలి నుంచి గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి వైపునకు భారీ వాహనాలను అనుమతించరు.
- అనకాపల్లి నుంచి నగరం వైపునకు వచ్చే భారీ వాహనాలను లంకెలపాలెం నుంచి సబ్బవరం మీదుగా మళ్లించారు.
- అడివివరం, గోపాలపట్నం పెట్రోల్ బంక్ కూడలి మధ్య వాహనాలను అనుమతించరు. ప్రత్యామ్నాయంగా దువ్వపాలెం, అక్కిరెడ్డిపాలెం, పెందుర్తి, వేపగుంట మీదుగా రాకపోకలు సాగించాలి.
- అడివివరం నుంచి తొలిపావంచాకు వచ్చే వారు వాహనాలను అడివివరం వద్దే నిలపాలి.
- వేపగుంట, గోపాలపట్నం నుంచి వచ్చే భక్తులు సింహపురికాలనీ వద్ద వాహనాలు నిలిపివేయాలి.
- హనుమంతువాక నుంచి వచ్చేవారు ఆదర్శనగర్, డెయిరీ ఫారం, టీఐసీ పాయింట్, ఆరిలోవ లాస్ట్ బస్‌స్టాప్ మీదుగా స్కిల్ డెవలప్‌మెంట్, డంపింగ్ యార్డు కూడలి వద్ద వాహనాలను పార్కింగ్ చేయాలి.
- అనకాపల్లి నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వచ్చే బస్సులు, ఇతర వాహనాలు లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా ప్రయాణాలు సాగించాలి.
- అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ వెళ్లవలసిన వాహనాలు ఆనందపురం మీదుగా మళ్లించారు.
- విజయనగరం, శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ రైల్వేస్టేషన్‌కు, ఎయిర్ పోర్టుకు, ఆర్టీసీ కాంప్లెక్స్ గాజువాక వైపువెళ్లే వాహనాలు ఆనందపురం నుంచి పెందుర్తి మీదుగా మళ్లించారు.


ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, తదితరులు

ప్రతిభావంతులకు సత్కారం

తగరపువలస, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఆదివారం చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాలలో గత ఏడాది ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన నిర్వాహకులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ ఉపాధ్యాయులు ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు నేర్చుకోవడం వల్ల పోటీ పరీక్షల్లో సులభంగా రాణించవచ్చునని సూచించారు. అనంతరం విద్యార్థులను సన్మానించారు.ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంటాన మోహనరావు, అప్పారావు, ఎంఈఓ శివరాణి, కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌గా భూ దందా

... 5వ పేజీ తరువాయి

భవనాల నిర్మాణానికి అవకాశం ఉంటుంది.

వైసీపీ నేతతో వ్యవహారం

ఈ విషయాన్ని గుర్తించిన ఓ టీడీపీ నేత ..రైతుల భూములపై కన్నేశారు. కానీ అప్పటికి వైసీపీ అధికారంలో ఉంది. దాంతో వైసీపీకి చెందిన నేత ద్వారా వ్యవహారం నడిపించారు. లేఅవుట్ ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాల స్థలాన్ని ఈడబ్ల్యూఎస్ లేవుట్‌లోని పది అడుగుల రోడ్డు విస్తరణకు కేటాయిస్తే, వెనుక భూములకు రోడ్డు సదుపాయం కలుగుతుందని, ప్రతిగా 180 గజాల భూమిని మిగిలిన ఓపెన్‌స్పేస్‌కు కలిసేలా ఇస్తామం టూ మళ్ల రమణ అనే వ్యక్తితో 2023 జూన్ 19న జీవీఎంసీకి దరఖాస్తు చేయించారు. దీనిపై తనకు సన్నిహితుడైన వైసీపీ నేత ద్వారా జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేసి, ప్రతిపాదనను కౌన్సిల్‌లో చర్చకు పెట్టకుండా అడ్డదారిలో ముందస్తు ఆమోదం పొంది, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. అయితే ఎన్నికల హడావిడి మొదలవ్వడంతో ఆ ప్రతిపాదన ఆగిపోయింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనను ఆమోదింపజేసే బాధ్యతను కూటమి నేత తీసుకున్నారు. పలుమార్లు సంబంధిత శాఖల అధికారులపై ఒత్తిడి చేయడంతో ఈ ఏడాది మార్చి ఐదున ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాల స్థలాన్ని లేఅవుట్ వెనుక ఉన్న రైతుల భూముల్లో లేఅవుట్ వేసుకోవడానికి వీలుగా కేటాయించడంతోపాటు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసేలా ఆదేశిస్తూ జీవీఎంసీకి మెమో జారీచేసింది. ఇందులో లొసుగులున్నాయనే భావనతో నాడు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ ఎంన్‌హరేంధిరప్రసాద్ జాప్యం చేయడంతో భూ బదలాయింపు ప్రక్రియ పూర్తికాలేదు. మధురవాడ జోన్-2 ఆరో వార్డు పరిధి బటర్‌ఫ్లై పార్కులోని 489 గజాల స్థలాన్ని వెనుకవున్న ప్రైవేటు వ్యక్తుల భూమికి బదలాయించిన విషయం 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో కోటనరవలోని ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లోని ఓపెన్‌స్పేస్‌ను కూడా అదే మాదిరిగా ప్రైవేటు వ్యక్తుల భూమికి బదలాయించారంటూ పలువురు 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఇచ్చారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారుల వద్ద ఆరా తీయగా ఏపీఎంఆర్‌యూడీఏ చట్టం-2016 లోని సెక్షన్ 93 ప్రకారం జీవీఎంసీ భూమిని ప్రైవేటు భూమికి బదులుగా మార్పిడి చేసుకునే వెసులుబాటు ఉందని, దాని ప్రకారమే తాము ముందుకువెళ్లామని వివరణ ఇవ్వడం విశేషం.

తెరపైకి ఫ్రీ హోల్డ్

... 5వ పేజీ తరువాయి

భూములపై కన్నేశారు. డీపట్టా ఇచ్చిన 20 ఏళ్ల తరువాత భూములపై రైతులకు హక్కులు కల్పించేలా ఫ్రీహోల్డ్ చేయాలని నిర్ణయించి, 2023 జీవో జారీచేశారు. అయితే జీవో వెలువడక ముందే వైసీపీ నేతలు, అధికారులు, రియల్టర్లు నగరం చుట్టూ వందలాది ఎకరాల డీపట్టా భూములను కొనుగోలుచేసి అనధికార ఒప్పందాలు చేసుకున్నారు. వీరిలో ఉన్నతస్థాయిలో పనిచేసి రిటైరైన ఓ అధికారి, అతని అనుచరులు త్రిలోక్, సుభాష్, గతంలో వైసీపీలో ఉండి ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్న నేత, మరికొందరు వైసీపీ నేతలు, వ్యాపారులు ఉన్నారు.

మూడువేల ఎకరాలకు దరఖాస్తులు

ఫ్రీహోల్డ్‌పై ప్రభుత్వం జీవో జారీ చేయడంతో జిల్లాలో సుమారు మూడువేల ఎకరాలకు రైతులు దరఖాస్తుచేశారు. వాస్తవంగా ఆనందపురం, పెందుర్తి, భీమిలి, పద్మనాభం, గాజువాక, పెదగంట్యాడ, సబ్బవరం మండలాల్లో ఆరువేల డీపట్టా భూములను పేదలకు ఇళ్ల కోసం సమీకరించారు. మిగిలిన మూడువేల ఎకరాలకు 2023లో దరఖాస్తులు వచ్చాయి. వీటిని అప్పటి జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొన్నింటిని తిరస్కరించి, తొలివిడతలో 609 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. వాటిలో ఆనందపురం, భీమిలి, పెందుర్తి, పద్మనాభం మండలాల్లోని 126 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేపట్టారు. అయితే ఈ భూములపై దుమారం రేగడంతో 2024 మార్చి తరువాత ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ నిలిపివేశారు. అప్పట్లో కీలక అధికారిగా పనిచేసిన వ్యక్తి కోసం అతని అనుచరులు త్రిలోక్, సుభాష్ ఆనందపురం మండలం గండిగుండం, రామవరం, భీమన్నదొరపాలెం, మామిడిపాలెం, పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురం, భీమిలి మండలం అన్నవరం, పరిసర గ్రామాలు, పద్మనాభం మండలంలో కొన్ని గ్రామాల్లో భూములకు అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల వైసీపీ నేతలు రైతులను బెదిరించారనే విమర్శలున్నాయి. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్రీహోల్డ్‌పై ఆంక్షలు విధించింది. ఏడాది తరువాత వాటిని తొలగించాలని నిర్ణయించంతో మరోసారి ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ ఊపందుకోనున్నది.

గ్రామీణ మండలాల్లోనే...

జిల్లాలోని పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతం ఉంది. పెందుర్తి, భీమిలిలో కొంతభాగం జీవీఎంసీ పరిధిలో ఉన్నది. వైసీపీ హయాంలో కూడా గ్రామీణ ప్రాంతంలోని డీపట్టా భూములకే ఫ్రీహోల్డ్ అనుమతులు ఇచ్చారు. జీవీఎంసీ పరిధిలో భీమిలి, పెందుర్తి, విశాఖ రూరల్, గోపాలపట్నం, గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో ఉన్న డీపట్టా భూములకు ఇవ్వలేదు. తాజాగా ప్రభుత్వం ఫ్రీ హోల్డ్‌కు అనుమతిచ్చిన నేపథ్యంలో గతంలో అనుసరించిన విధానాన్ని కొనసాగించాలని యంత్రాంగం నిర్ణయించింది. ఆనందపురం, పద్మనాభం మండల కేంద్రాల్లోనూ ఫ్రీహోల్డ్ అనుమతులు ఇవ్వకూడదని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రేవళ్ళపాలెం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, రేవళ్ళపాలెం, పీఎంపాలెం పోలీస్ స్టేషన్, వల్లీనగర్, ఎంఎస్ఆర్ లేఅవుట్, భాస్కర్‌నగర్, నగరంపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

నేడు మంత్రి పార్థసారథి పర్యటన

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.50 గంటలకు ఆయన నగరంలోని నోవాటెల్‌కు చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 11 గంటలకు అనకాపల్లి జిల్లా మాడుగుల చేరుకుని టీటీడీ కల్యాణ మండపంలో జరిగే డీసీసీబీ రుణాల పంపిణీలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్యవరం గ్రామంలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి విశాఖ చేరుకుంటారు.

దక్షిణ ఏసీపీ త్రినాథ్‌కు బదిలీ

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ ఏసీపీ టి. త్రినాథ్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. త్రినాథ్ మూడేళ్ల సౌత్ ఏసీపీగా పనిచేశారు. గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆందోళనల సమయంలో ఆయన సమయస్ఫూర్తిగా వ్యవహరించి శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా వ్యవహరించారన్న గుర్తింపు పోలీస్ అధికారుల్లో ఉంది. ఆయన స్థానంలో ఏలూరు రేంజ్‌కు చెందిన అధికారికి పోస్టింగ్ ఇస్తారని సమాచారం.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు, అందుబాటులో ఉంటారన్నారు. అలాగే, కాల్ సెంటర్ 1100ను సంప్రతించి ప్రజలు వినతులు నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఏయూలో ఘన నివాళి



జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, జూలై 6(ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఏయూలో గల బాబూ జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ దేశానికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 44, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

బజార్‌కు రావాలంటే బేజార్..!



ఎంవీపీ రైతు బజార్ చుట్టూ ట్రాఫిక్‌కు ఇబ్బందిగా నిలిపిన వాహనాలు

- ఏళ్లు గడిచినా ఎంవీపీ రైతుబజార్ వద్ద పరిష్కారానికి నోచుకోని ట్రాఫిక్ సమస్య
- పెదవాల్తేర్ బజార్ వద్ద కూడా అదే తీరు
- పట్టించుకోని అధికారులు

ఎంవీపీ కాలనీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ రైతు బజార్ రాష్ట్రంలోనే మోడల్ రైతు బజార్‌గా పేరొందింది. అయితే, వర్షాల నేపథ్యంలో ఈ బజార్‌లోకి అడుగు పెట్టాలంటానే ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. ఆది నుంచి ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఉంది. ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం లేదు.

ఈ బజార్‌లోకి ప్రవేశానికి రెండు వైపులా గేట్లు ఉన్నాయి. కానీ లోపలకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా అంత సులభమేమీ కాదు. గేటును ఆనుకుని చిరు వ్యాపారాలు చేసుకునే వారు ఉన్నారు. క్యాన్సర్ ఆస్పత్రి వైపు రహదారిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో అటూ ఇటూ తిరిగే వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. ఇక రైతు బజార్‌లోకి వెళ్లాలంటే మరింత కష్టమవుతోంది. చిరు వ్యాపారుల కారణంగా ఒక్కోసారి ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. అయినా ఇక్కడ పట్టించుకునే నాథుడు లేడు. డబుల్ రోడ్డు వైపు కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ ద్విచక్ర వాహనాలు కూడా ఇక్కడ పార్కు చేస్తున్నారు. ఇక పండగలు, పబ్బాలు వస్తే ప్రయాణికులకు నరకమే. ఆ దారిలో వాహనాలు ప్రయాణించడం నరకప్రాయమే. పండగల పూట ఎలా ఉన్నా, మిగిలిన రోజుల్లో అయినా ట్రాఫిక్ పోలీసులు ఇక్కడి పరిస్థితిపై దృష్టి సారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పెదవాల్తేర్‌లోనూ అంతే..

పెదవాల్తేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరు బజార్ ఆవరణలో వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, రైతుబజార్‌లోకి వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంటోందని రైతుబజార్‌కు వచ్చే కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రీటౌన్ పోలీసుస్టేషన్ రోడ్డు నుంచి సీబీఐ కార్యాలయం వరకు వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పోలీసులు, రైతుబజార్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పెదవాల్తేర్ : త్రిటౌన్ పోలీసుస్టేషన్ రోడ్డుపై అస్తవ్యస్తంగా నిలిపిన వాహనాలు

కుక్కలకు ఏటా రేబిస్ వ్యాక్సిన్లు తప్పనిసరి

- పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కరుణాకరరావు

వెంకోజీపాలెం, జూలై 6 : పెంపుడు శునకాలకు క్రమం తప్పకుండా ప్రతి ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర రావు సూచించారు. ప్రపంచ జునోసిస్ డేను పురస్కరించుకుని ఆదివారం ఇసుకతోట పశు వైద్య కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో పెంపుడు శునకాలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు అతి త్వరగా వచ్చే వ్యాధి రేబిస్ అని, పెంపుడు శునకాలు మనుషులకు అతి సన్నిహితంగా ఉంటాయి కనుక వాటి నుంచి త్వరగా రేబిస్ వ్యాధి సోకుతుందన్నారు. కనుక ప్రతి ఏటా జూనోసెస్ డేను పురస్కరించుకుని ప్రభుత్వం ఉచితంగా శునకాలను యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేస్తుందన్నారు. ఈ వ్యాక్సిన్‌ను ప్రతి ఒక్క పెంపుడు శునకాల యజమానులు తమ కుక్కలకు వేయించాలని కోరారు. జీవీఎంసీ వారు వీధి కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేస్తున్నారని, అంతేకాకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు కూడా వేస్తున్నారన్నారు. జేడీ కార్యాలయం వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రసాదరావు వైద్య కేంద్రం డాక్టర్ ఎస్.జి.ప్రశాంతి మాట్లాడుతూ నగర పరిధిలోని అన్ని పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు విధిగా వ్యాక్సిన్ వేయించాలని, తద్వారా రేబిస్ వ్యాధి సోకకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ సందర్భంగా 224 శునకాలను వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో వైద్య కేంద్రం సిబ్బంది కరుణ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



వెంకోజీపాలెం : వ్యాక్సిన్లు వేస్తున్న జేడీ డాక్టర్ కరుణాకరరావు, డీడీ డాక్టర్ చంద్రశేఖర్, వెటర్నరీ డాక్టర్ ప్రశాంతి



ఆరిలోవ : చినగదిలి పశు వైద్యశాల వద్ద కుక్కలకు వ్యాక్సిన్లు వేయించేందుకు వచ్చిన యజమానులు

ఆరిలోవలో..

ఆరిలోవ, జూలై 6 ఆంధ్రజ్యోతి) : ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా చినగదిలిలోని పశు వైద్యశాలలో రేబిస్ వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా 523 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల గురించి పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్.కరుణాకర రావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 250కి పైగా జునాటిక్ వ్యాధులు ఉన్నట్టు తెలిపారు. ప్రధానంగా కుక్కల నుంచి వచ్చే రేబిస్ వ్యాధి, దాని లక్షణాల గురించి వివరించారు. ఈ వ్యాధి సోకకుండా కుక్కలకు ప్రతి సంవత్సరం వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, వైద్యులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవ ఆలయాల్లో వైభవంగా తొలి ఏకాదశి పూజలు

- వేకువ జాము నుంచే దేవాలయాలకు పోటెత్తిన భక్తులు



ఎంవీపీ కాలనీ : సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న జంటలు



వెంకోజీపాలెం : వేంకటేశ్వర ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

వెంకోజీపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఎంఎంటీసీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వెంకన్నస్వామికి విష్ణు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తులసీ దళాలతో అలంకరించి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో రోడ్డుపైకి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ ఆచార్యులు, వంశీ ఆధ్వర్యంలో భక్తులకు గోత్రనామాలతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి టి.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్త వెంకోజీపాలెంలోని శ్రీవైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం, ఇసుకతోట వెంకన్నస్వామి ఆలయంలోనూ తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు.



వెంకోజీపాలెం : తులసీ దళాలతో అలంకృతుడైన వేంకటేశ్వర స్వామి

పరిసర ప్రాంతాల నుంచి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. తెల్లవారు జాము నుంచే ఏకాదశి పూజల కోసం ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. ఆలయ అర్చకులు వీరభద్రరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు, సభ్యులు జయరాం, గౌరీ, లక్ష్మీనారాయణ, జగన్, మూర్తి తదితరులు సేవలు అందించారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీప్రసన్నఆంజనేయస్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి (శయనైకాదశి) సందర్భంగా ఆదివారం సత్యన్నారాయణ స్వామి వారి సామూహిక వ్రతాలను నిర్వహించారు.

మద్దిలపాలెంలో...

మద్దిలపాలెం, జూలై 6 : శివాజీపాలెంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో శనివారం ఆషాడం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి వినాయక స్వామికి సహస్రనాయ అర్చనలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో 108 దీపారాధనలు చేసి స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజలు చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దీపారాధన చేసిన భక్తులు

గిరిజన ప్రాంతాల్లో సేవకు రోటరీ క్లబ్‌లు ప్రాధాన్యమివ్వాలి

- ఆచార్య వి.సుబ్రహ్మణ్యం

సిరిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు చేయూతనిచ్చేందుకు రోటరీ క్లబ్‌లు ప్రాధాన్యతమివ్వాలని ఆచార్య వి.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం సిరిపురంలోని ఓ హాలు లో రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌత్ ప్రెసిడెంట్ వి.శివకుమార్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా ఆర్వీ రాజశేఖర్, కోశాధికారిగా పి.ప్రభాకర్ ఇతర విభాగాలకు చెందిన నూతన కార్యవర్గ ఇన్‌స్టలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నిరంతరం సేవ చేయడమే రోటరీ లక్ష్యంగా పెట్టుకోవడం అభినందనీయమన్నారు. ఆచార్య కె.తిమ్మారెడ్డి మాట్లాడుతూ రోటరీ సభ్యులు స్నేహపూర్వకంగా మెలుగుతూ ఓ కుటుంబంలా సేవలందిస్తారని కొనియాడారు.నూతన అధ్యక్షుడు వి.శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే కాలంలోని మరిన్ని సేవ కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో రోటరీ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఛాయాదేవి రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య సుబ్రహ్మణ్యం తదితరులు

9న జాతీయ కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ

వెంకోజీపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు జరుగనున్న దేశవ్యాప్తంగా సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం శతాబ్దాల కృషితో సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చినప్పటి నుంచి కార్మికుల హక్కులు క్షీణించాయని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 17 ద్వారా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిర్వీర్యమైందని, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు విస్మరించిందని విమర్శించారు. ఇప్పటికైనా జీవో 17ను రద్దు చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న 46 వేల బీమా క్లెయిములకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నలుగురు లేబర్ కోడ్స్ భవన కార్మికుల పాలిట శాపమని, వాటిని రద్దుచేయాలని, జరిగే సమ్మెలో జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు.

సమ్మెను జయప్రదం చేయండి : సీపీఐ

తగరపువలస, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈనెల 9న జరగనున్న సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జీఆర్ భవన్‌లో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన సీపీఐ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులపై కక్ష కట్టిందని, హక్కులు హరించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడుతూ కార్మిక చట్టాలను పోరాటాలు చేసి సాధించుకున్నామని, వాటిని నిలబెట్టుకోవడానికి మళ్లీ పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఎం. అప్పలరాజు, చిల్ల నరసింహులు, పైడయ్య, మాపూరి వీర్రాజు అప్పలసూరి, సూరిబాబు. గోవిందరావు, దుంప శ్రీను, అప్పారావు మాట్లాడారు.

కొమ్మాది : కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కొనసాగించాలని, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐ టీయూ మద్దిలపాలెం జోన్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం వారు సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కొమ్మాది జంక్షన్ నుంచి కార్‌షెడ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీటూ జోన్ అధ్యక్షుడు డి. అప్పలరాజు మాట్లాడుతూ ఈనెల 9న కార్మికులందరూ సమ్మెలో పాల్గొని ఉదయం 10 గంటలకు రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేయాలన్నారు.

పాండురంగడి ఆలయంలో ప్రత్యేక పూజలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

సిరిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీపాండురంగస్వామి దేవాలయంలోని ఆలయ ఈవో ఎ.దేవుళ్ళు సారథ్యంలో ఆషాడ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం రుక్మిణి సమతే శ్రీపాండురంగ స్వామివారికి ఆలయ అర్చకులు కె.శ్రీరామ్మూర్తి సంప్రదాయ రీతిలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సినిమా అనేది ఒక సైన్స్ వంటిది

- ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఎంవీ రఘు



ఎంవీ రఘును సన్మానిస్తున్న నరవ ప్రకాశరావు, వీఎఫ్ఎస్ ప్రతినిధులు

సిరిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సినిమా అనేది ఒక సైన్స్ వంటిది దానిని సరైన పద్ధతిలోని నేటి తరానికి చెందిన యువతీయువకులు వినియోగించుకోవాలని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఎంవీ రఘు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సిరిపురం బీవీఐ హాలులో సినీ రంగంలోని 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంవీ రఘును వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ 50 సంవత్సరాల పాటులుగా సినిమా రగంలో సేవలందిస్తున్న తనకు వైజాగ్ ఫిల్మ్ సొసైటీతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. హైదరాబాద్ వంటి నగరంలోని సినిమా అంటే ఏంటీ అందులోని ఎటువంటి అద్భుతాలు చేయవచ్చో అనే అంశాలు, సినిమాట్రోగఫీలో టెక్నిక్‌లు నేటి యువతకు తెలియజేస్తున్నానన్నారు. 'కళ్లు' వంటి చిత్రానికి సినిమాట్రోగఫీనే కాకుండా దర్శకత్వం వహించడం జరిగిందని, ఆ చిత్రం ఒక క్లాసికల్ చిత్రంగా నిలవడం ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించడమే కాకుండా దానికి దోహదపడిన వ్యక్తులు, సినీ ప్రియులకు చేరువచేయడమే తమ ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, ఉపాధ్యక్షులు కృష్ణారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, గణేశ్వరరావు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

8న కనకదుర్గ జాతర



పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలోని శ్రీసీతారామ సేవా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 8న జరుగనున్న కనకమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు తులగపు వెంకటరమణ, తులగపు రవి శాస్త్రిలు విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం కమిటీ సభ్యులు సమీపంలోని తోటి గవర సంఘాలైన పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం, కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘంకు ఉత్సవం ఆహ్వాన పత్రికలను ఇచ్చారు. శ్రీసీతారామ సేవా సంఘం నుంచి అధ్యక్షుడు కర్రి వెంకటఅప్పారావు, ఉపాధ్యక్షులు పెంటకోట ప్రకాష్, ఇతర కార్యవర్గం బొడ్డేటి రామకృష్ణ, కర్రి రవికుమార్, మాజీ గౌరవ అధ్యక్షులు పీల వెంకట పరదేశినాయుడులు ఈ ఆహ్వాన పత్రికను అందుకున్నారు. దీనిలో శ్రీ సీతారాసేవా మండలి అధ్యక్షులు కోరిబిల్లి త్రినాథ్, ఉత్సవ కమిటీ సభ్యులు కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు, మద్ది శశిభూషణరెడ్డి, సూరిశెట్టి అప్పలరాజు (బుజ్జి), సూరిశెట్టి సత్యనారాయణ, పెంటకోట రమేష్, సూరిశెట్టి చిన్నబాబు, రాపేటి గోవింద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

భీమునిపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఒక రిసార్ట్‌లో జరుగుతున్న పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 2.51 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సీఐలు భారత్‌కుమార్, భాస్కరరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎస్ఐ గౌరి మినీ స్టేడియం ఎదురుగా ఉన్న రిసార్టులో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఏడుగురుని అదుపులోకి తీసుకున్నారు. నిందితులంతా గాజువాక, మర్రిపాలెం, ఎన్ఏడీ జంక్షన్, 104 ఏరియా ప్రాంతాలకు చెందినవారు.వారిలో ఒక ఆటో డ్రైవర్ కూడా ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశ్రయులకు సత్యసాయి సేవా సంస్థ సేవలు



నిరాశ్రయుడైన బాలుడికి క్షవరం చేయిస్తున్న సేవా సంస్థ వలంటీర్లు

ఎంవీపీ కాలనీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా పరిధిలోని శ్రీసత్యసాయి సేవా సంస్థల యువజన విభాగం నిరాశ్రయులకు పలు సేవలను అందించింది. రైల్వేస్టేషన్ సమీపంలో ఉంటున్న అనేక మంది నిరాశ్రయులకు సంస్థ వలంటీర్లు సుమారు 180 మందిని కలసి ఆదివారం విశేష సేవలు అందించారు. ఆర్తి జనోద్ధరణ సేవ పేరిట నిరాశ్రయులను గుర్తించి, వారందరినీ ఓ చోటకు చేర్చారు. షేవింగ్, జుట్టు కత్తిరించడం, వెచ్చని నీటితో స్నానం చేయించడం, శుభ్రమైన దుస్తులు ధరింప చేయడం, గాయాలకు మందు పూయడం వంటివి చేశారు. ఆరోగ్యకర భోజనం పెట్టారు. సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, యువజన సమన్వయకర్త మణికంఠ, సత్యసాయి సేవా సమితులు, భజన మండళ్లు, ఇతర పదాదికారులు పాల్గొన్నారు.

పెంటగాన్ రెగ్డ్ సిస్టమ్స్‌తో షిప్‌యార్డు ఎంవోయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న షిప్‌యార్డు అధికారులు, పెంటగాన్ రెగ్డ్ ప్రతినిధులు

మల్కాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నేవల్ ప్లాట్‌ఫామ్ కోసం యాంటీ-డ్రోన్ టెక్నాలజీ అండ్ లాంగ్ రేంజ్ ఎన్ఎల్ఓఎస్ కమ్యూనికేషన్‌పై సహకరించడానికి హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ కంపెనీ పెంటగాన్ రెగ్డ్ సిస్టమ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. షిప్‌యార్డు సముద్ర భద్రత, కమ్యూనికేషన్‌లో అత్యాధునిక పరిష్కారాలతో నావికా నౌకలపై అత్యాధునిక యాంటీ-డ్రోన్ వ్యవస్థలను సంయుక్తంగా అనుసంధానించడానికి శనివారం పెంటగాన్ రెగ్డ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం చేసుకోవడం ద్వారా భవిష్యత్తు యుద్ధ సన్నద్ధత వైపు నిర్ణయాత్మక అడుగు వేసింది. ఈ సందర్భంగా షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ మాట్లాడుతూ అసమాన డ్రోన్ ముప్పులను ఎదుర్కొనడంలో కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ నేవీకి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఈ ఒప్పందంతో రక్షణ సాంకేతికలో ఓ కీలకమైన అడుగు వేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ ఇండియా లిమిటెడ్ ఎండీ డాక్టర్ స్వామినాథన్ మణికందన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల నాణ్యత..నవ్వులపాలు!



అక్కయ్యపాలెం బస్‌స్టాప్ దాటిన వెంటనే హైవేపై గుంత

అసలే జాతీయ రహదారి... వాహనాల రద్దీ సంగతి చెప్పనక్కరలేదు. ఇలాంటి మార్గంలో ప్రజాధనంతో చేపట్టిన పనుల నాణ్యత, పర్యవేక్షణ ఎలా ఉండాలి? ఏలికలు, ఉన్నతాధికారులు నిత్యం రయ్యిన దూసుకుపోయే ఈ మార్గం ఎంతో కీలకమని సాంకేతిక అవగాహన లేనోళ్లు సైతం చెబుతారు. నగరం నుంచి వెళుతున్న జాతీయ రహదారికి నెల రోజులపాటు కోట్ల రూపాయల వ్యయంతో మరమ్మతులు జరుగుతున్నాయి. కొత్త లేయర్ వేస్తున్నారు. ఈ పనులు ఇంకా పూర్తికానేలేదు. అప్పుడే నాణ్యత వెక్కిరిస్తూ పనుల్లో డొల్లతనం బయటపడింది. అక్కయ్యపాలెంలో బస్టాపు దాటిన తరువాత భారతీయ విద్యాభవన్‌కు ఎదురుగా చిన్నపాటి వర్షానికే పెద్ద గొయ్యి పడింది. ఇక్కడ పనులు పూర్తి చేసి నెల రోజులు కూడా కాలేదు. ఈ రహదారికి ఐదేళ్ల జీవిత కాలమని నేషనల్ హైవే అథారిటీ చెబుతోంది. ఆదిలోనే ఇలా ఉంటే ఐదేళ్లలో ఇంకెన్ని గుంతలు పడతాయో చెప్పక్కర్లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ అసలు ఉందా? అన్నదే సామాన్యుడి సణుగుడు. ఈ వ్యవహారంపై సెంట్రల్ విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

గురుద్వార బస్ బే...గోతులు బాబోయ్!



గురుద్వార బస్ బే వద్ద గులకరాళ్లు తేలిన రహదారి

సీతంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గురుద్వార నుంచి అక్కయ్యపాలెం వైపు వెళ్లే మార్గంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బస్సు బే (గురుద్వార బస్‌స్టాప్) ముందు రహదారి అధ్వానంగా తయారైంది. బస్‌స్టాప్ ఎదురుగా రహదారిలో తారు మాయమైంది. గులకరాళ్లు తేలి ప్రమాదభరితంగా మారింది. కొద్ది కాలం క్రితమే నిర్మించినా అప్పుడే రాళ్లు తేలిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా నిర్మించిన బస్ బే ముందర ఇలా గోతులమయం కావడం, వర్షపు నీరు నిలిచిపోవడంతో బస్సు స్టాప్‌కి వచ్చిన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్‌బే ఏర్పాటు చేసినా కొన్ని లైట్లు వెలగటం లేదు. అక్కడ సీలింగ్ ఫ్యాన్లు కూడా లేవు. బస్సు స్టాప్ వెనుక పెద్ద గెడ్డ ఉండటంతో చీకటికాగానే దోమలు విజృంభిస్తున్నాయని ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. గోతిలో నిండిన వర్షపు నీటి పైనుంచి బస్సు వచ్చినప్పుడు బురద నీరు ప్రయాణికులపై పడుతోంది. రహదారిని వెంటనే బాగుచేసి, బస్సు బే వద్ద పరిస్థితి మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నాటక రచనల డిజిటలీకరణ అభినందనీయం

విశ్రాంత ఐఏఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య



వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖులు

సీతమ్మధార, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నాటకం కోసం జీవితాన్ని అంకితం చేసిన బాదంగీర్ సాయి తీపి గుర్తుగా పదివేల నాటక పుస్తకాలను డిజిటలైజేషన్ చేసి అందుబాటులోకి తేవడం అభినందనీయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య అన్నారు. రైటర్స్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం వెబ్‌సైట్ ఆవిష్కరణ సభ జరిగింది. మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నం వెంకటరాయుడు మరికొందరు అతిథులతో కలిసి వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. బలరామయ్య మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నాటకాలను అందించడానికి బాదంగీర్ సాయి స్వయంగా ఒక లైబ్రరీ ఏర్పాటు చేయడం విశేషమన్నారు. తన కుమార్తె సృజన జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్నప్పుడు టీఎస్సార్ కాంప్లెక్స్‌లో నాటక గ్రంథాలయం ఏర్పాటు చేశారన్నారు. తెలుగు నాటకాల డిజిటలైజేషన్ తొలుత ప్రారంభించిన వెంపటి రాధాకృష్ణను స్ఫూర్తిగా తీసుకుని మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నం వెంకటరాయుడు సహకారంతో డిజిటలైజేషన్ చేసినట్లు పేర్కొన్నారు. రైటర్స్ అకాడమి ఛైర్మన్ వి.వి. రమణమూర్తి కృషితో వెబ్‌సైట్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సినిమాటోగ్రాఫర్ ఎంవీ రఘు, విశ్రాంత ఐపీఎస్ అధికారి అత్తిలి సుధాకర్, నటుడు కొల్లి మోహనరావు, మేడా మస్తాన్‌రెడ్డి, వెంపటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు, గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో పలు రైళ్ల పాక్షిక రద్దు, గమ్యాల కుదింపు కొనసాగుతోంది. కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, సమలేశ్వర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 8 వరకు పాక్షికంగా రద్దు చేయడంతోపాటు కొరాపుట్ వరకే నడుపుతామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

కిరండూల్ రైళ్లు కొరాపుట్ వరకే

విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 7న విశాఖలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (18516) ఈ నెల 8న కొరాపుట్ నుంచి బయలుదేరి విశాఖ చేరుతుంది. కొరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (18005) 7న హౌరాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-హౌరా సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (18006) ఈ నెల 8, 9న కొరాపుట్‌లో బయలుదేరి హౌరా చేరుతుంది. ఈ సర్వీసులకు కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. రూర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (18107) ఈ నెల 7న రూర్కెలాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-రూర్కెలా ఇంటర్‌సిటీ (18108) ఈ నెల 7, 8లలో కొరాపుట్‌లో బయలుదేరి రూర్కెలా చేరుతుంది. ఈ సర్వీసులకు కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18447) ఈ నెల 7న భువనేశ్వర్‌లో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18448) ఈ నెల 7, 8లలో కొరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులకు కొరాపుట్, జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మద్రిపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మద్రిపాలెం జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో గల మజీద్ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో ఆదివారం మొహర్రం ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారుజామున ముస్లింలు మజీద్‌లో ఖురాన్ పఠించారు. అనంతరం మజీద్ ప్రాంగణంలో హఫీజ్ (ముస్లిం మత గురువు) తక్రీర్ పఠించారు. ఈ సందర్భంగా పాలు, బెల్లం, పుట్నాలతో తయారు చేసిన ప్రత్యేక పానీయాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మజీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

ముగిసిన చదరంగం పోటీలు

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం నేతృత్వంలో శ్రీ చెస్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-13 ఓపెన్, బాలికల చదరంగం పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు ఆదివారం ముగిశాయి. విశాఖ వేలీ స్కూల్‌లో జరిగిన ఈ టోర్నీలో జిల్లా వ్యాప్తంగా 53 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ టోర్నీ ఓపెన్ కేటగిరిలో కృష్ణ వరుణ్య పొట్నూరు, శివేన్ కనకాల...బాలికల విభాగంలో దివ్య దర్శిని మోయదా, అఫ్షిన్ మహ్మద్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. తొలి రెండు స్థానాలలో నిలిచిన క్రీడాకారులు వచ్చే నెల కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు.

వీధి నాటకాలకు నేటికీ ఆదరణ

సీతమ్మధార, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలోనూ వీధి నాటకాలకు ఆదరణ ఉందని టామీ టామీ టామీ నాటకం రుజువు చేసిందని ఏయూ ఆర్ట్స్ కళాశాల, థియేటర్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అన్నారు. ఆదివారం పౌరగ్రంథాలయం ఎదురుగా రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో సుదర్శన్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు వీధి నాటకం ప్రదర్శించారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ అత్తిలి కృష్ణారావు రాసిన నాటకానికి బొబ్బా ధవళేశ్వరరావు చక్కని దర్శకత్వం వహించారన్నారు.

గిరి ప్రదక్షిణలో ట్రాఫిక్ ఆంక్షలు

సింహాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9, 10 తేదీల్లో జరిగే సింహగిరి ప్రదక్షిణ నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. 9న ఉదయం 6 నుంచి 10న సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.

- సత్తరువు కూడలి నుంచి అడివివరం వరకు భక్తుల వాహనాలను అనుమతిస్తారు. అక్కడి నుంచి హనుమంతువాక కూడలి వైపునకు వాహనాలను అనుమతించరు.
- గోపాలపట్నం పెట్రోల్ బంక్ కూడలి నుంచి పాతగోశాల కూడలికి ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- పెందుర్తి, పినగాడి మీదుగా వేపగుంట కూడలివైపు భారీవాహనాలకు అనుమతి లేదు.
- ఎన్ఏడీ కూడలి నుంచి గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి వైపునకు భారీ వాహనాలను అనుమతించరు.
- అనకాపల్లి నుంచి నగరం వైపునకు వచ్చే భారీ వాహనాలను లంకెలపాలెం కూడలి నుంచి సబ్బవరం మీదుగా మళ్లించారు.
- అడివివరం, గోపాలపట్నం పెట్రోల్ బంక్ కూడలి మధ్య వాహనాలను అనుమతించరు. ప్రత్యామ్నాయంగా దువ్వపాలెం, అక్కిరెడ్డిపాలెం, పెందుర్తి, వేపగుంట మీదుగా రాకపోకలు సాగించాలి.
- అడివివరం నుంచి తొలిపావంచాకు వచ్చేవారు వాహనాలను అడివివరం కూడలి వద్దే నిలిపివేయాలి.
- వేపగుంట, గోపాలపట్నం నుంచి వాహనాల్లో వచ్చే భక్తులు సింహపురికాలనీ వద్ద నిలిపివేయాలి.
- హనుమంతువాక నుంచి వచ్చేవారు ఆదర్శనగర్, డెయిరీ ఫారం, టీఐసీ పాయింట్, ఆరిలోవ లాస్ట్ బస్‌స్టాప్ మీదుగా స్కిల్ డెవలప్‌మెంట్, డంపింగ్ యార్డు కూడలి వద్ద వాహనాలను పార్కింగ్ చేయాలి.
- అనకాపల్లి నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వచ్చే బస్సులు, ఇతర వాహనాలు లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా ప్రయాణాలు సాగించాలి.
- అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ వెళ్లవలసిన వాహనాలను ఆనందపురం మీదుగా మళ్లించారు.
- విజయనగరం, శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ రైల్వేస్టేషన్‌కు, ఎయిర్ పోర్టుకు, ఆర్‌టీసీ కాంప్లెక్స్, గాజువాకలకు వాహనాలు ఆనందపురం నుంచి పెందుర్తి మీదుగా మళ్లించారు.

వైభవంగా తొలిఏకాదశి పూజలు



ప్రసన్న వేంకటేశ్వరునికి చందన అలంకారం

అల్లిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం దక్షిణ నియోజకవర్గంలోని పలు వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అల్లిపురం వెంకటేశ్వరమెట్ట వద్ద గల ప్రసిద్ధ బల్లగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనానికి విచ్చేశారు. వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామివారిని చందనంతో విశేషంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు దీపాలంకరణ చేశారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్/సీతమ్మధార, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ బలహీనవర్గాల ఆశాజ్యోతి అని దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి సభను విశాఖ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఉత్సాహంగా పాల్గొని సామాజిక సమానత్వంపై అందరినీ చైతన్యపరిచేందుకు జగ్జీవన్ అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. 50 సంవత్సరాలపాటు నిరంతరం పార్లమెంట్ సభ్యుడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పారని గుర్తుచేశారు. సంఘం సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. సీతమ్మధారలోని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సిబ్బంది జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, పార్లమెంటేరియన్‌గా, ఉప ప్రధానిగా, క్యాబినెట్‌లో అనేక కీలక శాఖలను నిర్వహించి దేశానికి సేవలందించిన జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శ్యామా ప్రసాద్‌కు ఘన నివాళులు



శ్యామాప్రసాద్ చిత్రపటం వద్ద నమస్కరిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

సీతమ్మధార/మురళీనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ మేరకు ముఖర్జీ చిత్ర పటానికి ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్‌లీడర్ పి.విష్ణుకుమార్ రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశభక్తి, త్యాగం, జాతీయ సమైక్యత కోసం చేసిన కృషిని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ముఖర్జీ ఆశయాలను కొనసాగించేందుకు బీజేపీ నిబద్ధతను పునరుద్ఘాటించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, అనిల్, దుర్గారావు, ప్రసాద్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జన సంఘ్ వ్యవస్థాపకులు శామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యతకు చిహ్నంగా నిలిచారని బిజెపి వికసిత్‌భారత్ జిల్లా కో కన్వీనర్ మూల వెంకటరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశప్రజల్ని ఆయన సిద్ధాంతాలు ఏకతాటిపై నడిపించాయని కీర్తించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు, మాజీ అధ్యక్షుడు నరేంద్ర మోహన్ తదితరులతో కలసి ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను నెరవేర్చడానికి బీజేపీ శ్రేణులంతా కలసికట్టుగా ముందుకెళ్లాలని నాయకులు సూచించారు.

ప్రేమ సమాజం డైరెక్టర్ జగన్నాథరావుకు ఘన సన్మానం



జగన్నాథరావును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

అక్కయ్యపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమ సమాజం పాలకవర్గం డైరెక్టర్‌గా నూతనంగా ఎన్నికైన పీసీసీ సభ్యుడు, కేంద్ర గవర సంఘం సీనియర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వైఎస్ జగన్నాథరావును రైల్వేన్యూకాలనీలోని గవర కేంద్ర కార్యాలయంలో కేంద్ర గౌరీ సేవా సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర గవర సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ మాట్లాడుతూ ప్రేమ సమాజం అభివృద్ధి కోసం జగన్నాథరావు కృషి చేయాలన్నారు. జగన్నాథరావు మాట్లాడుతూ ప్రేమ సమాజంలోని చిన్నారుల బంగారు భవిష్యత్ కోసం తన వంతు పాటుపడతానన్నారు. ప్రేమ సమాజం ఎంతో మంది అభాగ్యులకు ఆసరా ఇస్తుందని, అనాథలకు భరోసానిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరీ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శరగడం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై యువతకు అవగాహన



యువతకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు

మహారాణిపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగంతో వాటిల్లే నష్టంపై ఆదివారం వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో యువతకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాల మైదానం ఆవరణలో సీఐ జి.దేముడు బాబు వారికి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మత్తు పదార్థాలు వినియోగిస్తూ చట్టానికి పట్టుబడితే ఎలాంటి శిక్షలు పడతాయో వివరించారు. నేర ఘటనలు జరిగే అవకాశం ఉన్నప్పుడు పోలీసులకు ముందస్తుగా సమాచారం అందించాలని, అలాంటి వారి విషయాలు గోప్యంగా ఉంచుతామని, తగిన పారితోషికం కూడా అందిస్తామని సీఐ తెలిపారు. విశాఖను నేర రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. సుమారు 200 మంది పాల్గొన్నారు.

ఓపెన్‌గా భూ దందా

... 5వ పేజీ తరువాయి

భవనాల నిర్మాణానికి అవకాశం కలుగుతుంది.

వైసీపీ నేతతో వ్యవహారం

ఈ విషయాన్ని గుర్తించిన ఓ టీడీపీ నేత రైతుల భూములపై కన్నేశారు. కానీ అప్పటికి వైసీపీ అధికారంలో ఉంది. దాంతో వైసీపీకి చెందిన నేత ద్వారా వ్యవహారం నడిపించారు. లేఅవుట్ ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాల స్థలాన్ని ఈడబ్ల్యూఎస్ లేవుట్‌లోని పది అడుగుల రోడ్డు విస్తరణకు కేటాయిస్తే, వెనుక భూములకు రోడ్డు సదుపాయం కలుగుతుందని, ప్రతిగా 180 గజాల భూమిని మిగిలిన ఓపెన్‌స్పేస్‌కు కలిసేలా ఇస్తామంటూ మళ్ల రమణ అనే వ్యక్తితో 2023 జూన్ 19న జీవీఎంసీకి దరఖాస్తు చేయించారు. దీనిపై తనకు సన్నిహితుడైన వైసీపీ నేత ద్వారా జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేసి, ప్రతిపాదనను కౌన్సిల్‌లో చర్చకు పెట్టకుండా అడ్డదారిలో ముందస్తు ఆమోదం పొంచి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. అయితే ఎన్నికల హడావిడి మొదలవ్వడంతో ఆ ప్రతిపాదన ఆగిపోయింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనను ఆమోదింపజేసే బాధ్యతను కూటమి నేత తీసుకున్నారు. పలుమార్లు సంబంధిత శాఖల అధికారులపై ఒత్తిడి చేయడంతో ఈ ఏడాది మార్చి ఐదున ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాల స్థలాన్ని లేఅవుట్ వెనుక ఉన్న రైతుల భూముల్లో లేఅవుట్ వేసుకోవడానికి వీలుగా కేటాయించడంతోపాటు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసేలా ఆదేశిస్తూ జీవీఎంసీకి మెమో జారీచేసింది. ఇందులో లొసుగులున్నాయనే భావనతో నాడు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ ఎంఎన్‌హరేంధిరప్రసాద్ జాప్యం చేయడంతో భూ బదలాయింపు ప్రక్రియ పూర్తికాలేదు. మధురవాడ జోన్-2 ఆరో వార్డు పరిధి బటర్‌ఫ్లై పార్కులోని 489 గజాల స్థలాన్ని వెనుకవున్న ప్రైవేటు వ్యక్తుల భూమికి బదలాయించిన విషయం 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోటనరవలోని ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లోని ఓపెన్‌స్పేస్‌ను కూడా అదే మాదిరిగా ప్రైవేటు వ్యక్తుల భూమికి బదలాయించారంటూ పలువురు 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఇచ్చారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారుల వద్ద ఆరా తీయగా ఏపీఎంఆర్‌యూడీఏ చట్టం-2016లోని సెక్షన్ 93 ప్రకారం జీవీఎంసీ భూమిని ప్రైవేటు భూమికి బదులుగా మార్పిడి చేసుకునే వెసులుబాటు ఉందని, దాని ప్రకారమే తాము ముందుకువెళ్లామని వివరణ ఇవ్వడం విశేషం.

తెరపైకి ఫ్రీ హోల్డ్

... 5వ పేజీ తరువాయి

భూములపై కన్నేశారు. డీపట్టా ఇచ్చిన 20 ఏళ్ల తరువాత భూములపై రైతులకు సర్వహక్కులు కల్పించేలా ఫ్రీహోల్డ్ చేయాలని నిర్ణయించి, 2023 జీవో జారీచేశారు. అయితే జీవో వెలువడక ముందే వైసీపీ నేతలు, అధికారులు, రియల్టర్లు నగరం చుట్టూ వందలాది ఎకరాల డీపట్టా భూములను కొనుగోలుచేసి అనధికార ఒప్పందాలు చేసుకున్నారు. వీరిలో ఉన్నతస్థాయిలో పనిచేసి రిటైరైన అధికారి, ఆయన అనుచరులు త్రిలోక్, సుభాష్, వైసీపీలో ఉండి ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్న నేత, మరికొందరు వైసీపీ నేతలు, వ్యాపారులు ఉన్నారు.

మూడువేల ఎకరాలకు దరఖాస్తులు

ఫ్రీహోల్డ్‌పై ప్రభుత్వం జీవో జారీ చేయడంతో జిల్లాలో సుమారు మూడువేల ఎకరాలకు రైతులు దరఖాస్తుచేశారు. వాస్తవంగా ఆనందపురం, పెందుర్తి, భీమిలి, పద్మనాభం, గాజువాక, పెదగంట్యాడ, సబ్బవరం మండలాల్లో ఆరువేల డీపట్టా భూములను పేదలకు ఇళ్ల కోసం సమీకరించారు. మిగిలిన మూడువేల ఎకరాలకు 2023లో దరఖాస్తులు వచ్చాయి. వీటిని అప్పటి జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొన్నింటిని తిరస్కరించి, తొలివిడతలో 609 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. వాటిలో ఆనందపురం, భీమిలి, పెందుర్తి, పద్మనాభం మండలాల్లోని 126 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేపట్టారు. అయితే ఈ భూములపై దుమారం రేగడంతో 2024 మార్చి తరువాత ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ నిలిపివేశారు. అప్పట్లో కీలక అధికారిగా పనిచేసిన వ్యక్తి కోసం అతని అనుచరులు త్రిలోక్, సుభాష్ ఆనందపురం మండలం గండిగుండం, రామవరం, భీమన్నదొరపాలెం, మామిడిపాలెం, పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురం, భీమిలి మండలం అన్నవరం, పరిసర గ్రామాలు, పద్మనాభం మండలంలో కొన్ని గ్రామాల్లో భూములకు అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల వైసీపీ నేతలు రైతులను బెదిరించారనే విమర్శలున్నాయి. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్రీహోల్డ్‌పై ఆంక్షలు విధించింది. ఏడాది తరువాత వాటిని తొలగించాలని నిర్ణయించంతో మరోసారి ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ ఊపందుకోనున్నది.

గ్రామీణ మండలాల్లోనే...

పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతం ఉంది. పెందుర్తి, భీమిలిలో కొంతభాగం జీవీఎంసీ పరిధిలో ఉన్నది. వైసీపీ హయాంలో కూడా గ్రామీణ ప్రాంతంలోని డీపట్టా భూములకే ఫ్రీహోల్డ్ అనుమతులు ఇచ్చారు. జీవీఎంసీ పరిధిలో భీమిలి, పెందుర్తి, విశాఖ రూరల్, గోపాలపట్నం, గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో ఉన్న డీపట్టా భూములకు ఇవ్వలేదు. తాజాగా ప్రభుత్వం ఫ్రీ హోల్డ్‌కు అనుమతిచ్చిన నేపథ్యంలో గతంలో అనుసరించిన విధానాన్ని కొనసాగించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఆనందపురం, పద్మనాభం మండల కేంద్రాల్లోనూ ఫ్రీహోల్డ్ అనుమతులు ఇవ్వకూడదని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

ఏయూ కేంద్రంగా డ్రగ్స్ రాకెట్!

... 5వ పేజీ తరువాయి

వినియోగించాల్సిన మత్తు మందులను దుకాణాల నుంచి కొనుగోలు చేసి, వినియోగిస్తున్న వారి సంఖ్యా పెరుగుతోంది. మెడికల్ షాపుల యజమానులు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండానే విచ్చలవిడిగా విక్రయించేస్తున్నారు.

విమానం, కొరియర్ ద్వారా దిగుమతి

నగరానికి చెందిన యువత ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లినపుడు అక్కడ డ్రగ్స్ వినియోగించేవారు, సరఫరా చేసేవారితో పరిచయం పెంచుకుంటున్నారు. వారితో ఒప్పందం కుదుర్చుకుని డ్రగ్స్ కొనుగోలుచేస్తున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపి, కొరియర్ ద్వారా దిగుమతి చేసుకుంటున్నారు. మరికొందరు ఏజెంట్ల ద్వారా విమానంలో దిగుమతిచేసుకుంటున్నారు. తాజాగా త్రీటౌన్ పోలీసులు ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో అనుమానాస్పదంగా ఉన్న కారుని చుట్టుముట్టారు. అందులోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని వేర్వేరుగా విచారించగా ఢిల్లీ నుంచి దక్షిణాఫ్రికాకు చెందిన వ్యక్తితో 25 గ్రాముల కొకైన్‌ను విమానంలో రప్పించామని నిందితుడు అక్షయ్ వివరించాడు. పోలీసులకు పట్టుబడిన దక్షిణాఫ్రికా జాతీయుడు తనకేమీ తెలియదని, ఒక వ్యక్తి కొంత డబ్బు ఇస్తానని, విశాఖ వెళ్లి ఒకరికి అందజేయాలనడంతో వచ్చానన్నాడు. అయితే అక్షయ్ పలుమార్లు ఢిల్లీ నుంచి కొకైన్ తెప్పించుకున్నట్టు పోలీసుల విచారణలో తేలడంతో లోతుగా విచారిస్తున్నారు. రామాటాకీస్ వద్దగల కొరియర్ ఏజెన్సీలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు డ్రగ్స్ ప్యాకెట్ గుర్తించి, విచారణ జరిపి యువకుడిని అరెస్ట్‌చేశారు. బెంగళూరు నుంచి వచ్చిన ట్రావెల్స్ బస్సులో కొకైన్‌ను పంపించగా, నగరానికి చెందిన రౌడీషీటర్ రామ్‌కిషోర్ దానిని తీసుకెళుతుండగా ఇంటెలిజెన్స్, త్రీటౌన్ పోలీసులు పట్టుకుని 4.5 గ్రాములను స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో మరో ముగ్గురిని అరెస్ట్‌చేసి వారి వద్ద 24.5 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఏయూ కేంద్రంగానే ....

నగరంలో డ్రగ్స్, గంజాయి వినియోగిస్తున్న వారిలో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే అధికం. వీరంతా ఏయూలోని స్నేహితుల ద్వారా దందాను సాగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. నగరంలో డ్రగ్స్, గంజాయి పట్టుబడిన సందర్భాల్లో తరచూ ఏయూ ప్రస్తావన రావడం దీనికి బలాన్ని చేకూర్చుతోంది. కొన్నాళ్ల కిందట ఏయూలో ఆకస్మికసోదాలు నిర్వహించగా ఓ హాస్టల్‌లో గంజాయి లభ్యమైంది. ఇంజనీరింగ్ మైదానం విశాలంగా ఉండడం, హాస్టళ్ల సముదాయంలో రాత్రివేళ అంధకారం నెలకొనడం గంజాయి, డ్రగ్స్ సేవించేవారికి అడ్డాగా మారిందనే విమర్శలున్నాయి. బీచ్ రోడ్డుతోపాటు శివారులోని ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల పరిసరాల్లోనూ డ్రగ్స్ వినియోగం పెరిగిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నగరవాసులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.



శునకాలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

పెంపుడు కుక్కలకు టీకాలు

పెందుర్తి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి మండల శాఖ పశు వైద్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి జగన్మోహనరావు ఆధ్వర్యంలో 327 పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా ఆయన కుక్కకాటు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడి: పెంపుడు శునకాలకు తప్పనిసరిగా అందరూ యాంటీ ర్యాబిస్ టీకాలను వేయించాలని స్థానిక పశువుల ఆస్పత్రి వైద్యాధికారిణి పి.లావణ్య కోరారు. జంతువుల ద్వారా మనుషులకు వ్యాపించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులుగా పేర్కొంటారన్నారు. జంతువులు కరిస్తే తక్షణమే అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి వివరించారు. అనంతరం పలు పెంపుడు కుక్కలను టీకాలు వేశారు. స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, బండారు చందూ రమేశ్, పైడికొండ, పెద అప్పారావు, సన్యాసిరావు, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేవీలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. 4, 9 తరగతుల్లో మిగులు సీట్లు, 6వ తరగతిలో మిగిలిన ఎస్టీ కేటగిరీ సీట్లు, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించి ఉక్కు ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లో దరఖాస్తు చేసుకోవాలని, 10న 4, 6, 10, 12 తరగతులకు లాటరీ ద్వారా, 9వ తరగతి విద్యార్థులకు పరీక్ష విధానం ద్వారా సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి బీఎల్‌వోలకు శిక్షణ

గాజువాక, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గం పరిధిలో ఉన్న బీఎల్‌వోలకు సోమవారం నుంచి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు ఇన్‌చార్జి తహశీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన ప్రత్యేక శిక్షణకు వెళ్లిన గాజువాకకు చెందిన బీఎల్‌వో ఇప్పుడు గాజువాకలో ఇతర బీఎల్‌వోలకు శిక్షణ ఇవ్వనున్నారు. నియోజకవర్గంలో 308 మంది బీఎల్‌వోలు ఉండగా, రోజుకు 40 మంది చొప్పున తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 రెండు గంటల వరకు శిక్షణ ఇస్తారు.

మొక్కలు నాటిన జేడీ ఫౌండేషన్

గోపాలపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చంద్రనగర్ అండర్‌పాస్‌వే పరిసర ప్రాంతాల్లో జేడీ ఫౌండేషన్ సభ్యులు మొక్కలు నాటారు. వర్షాల నేపథ్యంలో విత్తనబంతులు చల్లుతామని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 130, కీర దోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176



గ్రీన్ సిటీలో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి.. పక్కన ధ్వజస్తంభం వద్ద దీపారాధనలో పాల్గొన్న భక్తులు



రవినగర్ శేషాద్రికొండపై శేషపాన్పుపై శ్రీవారు

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- వేకువజాము నుంచే బారులుతీరిన జనం

కూర్మన్నపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హిందువుల తొట్టతొలి పండుగగా తొలి ఏకాదశిని పేర్కొంటారు. అంత ప్రాముఖ్యం గల తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం పలు ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు చేశారు. ఇందులో భాగంగా 88వ వార్డు పరిధి గ్రీన్‌సిటీలో శ్రీవైభవ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీధర్ స్వామి, వాసు స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బండి సురేశ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, వీవీ కృష్ణారావు, పద్మజ, రాజ్యలక్ష్మి, వి.వెంకటరావు, సునీల్, గణేశ్, నానాజీ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలాగే 87వ వార్డు పరిధి వడ్లపూడి సమీప రాజుల పాలెంలో గల శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారిని తులసి మాలలతో అలంకరించి పూజలు, పంచామృతాభిషేకాలు, విశేష హోమాలు జరిపారు. అనంతరం లోక కల్యాణార్థం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. సాయంత్రం ఆలయం వద్ద పలువురు మహిళలు అన్నమాచార్యుని గీతాలకు కోలాటాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అగనంపూడి: స్థానిక శాంతినగర్‌లో గల శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకుని పూజలు,అభిషేకాలు చేశారు. నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల ఈకే చారి, కమిటీ ప్రతినిధులు నరసింగరావు, సాయిబ్‌నాయుడు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సోమశేఖర్, మోహిని, నాగలక్ష్మి, గురునాథ్, సత్యనారాయణ, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: తొలి ఏకాదశి సందర్భంగా షీలానగర్ ఎస్బీఐఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంతో పాటు బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీవెంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగాయి. ప్రసన్నగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీవారికి పంచామృతాలతో



బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై శ్రీవారి ముంగిట ఏడుకొండలుగా అమర్చి నివేదించిన పులిహోర

అభిషేకాలు చేశాక ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం సుమారు 60 కిలోల పులిహోరను స్వామివారి ఎదుట రాశులుగా పోసి వాటిని ఏడుకొండలుగా అలంకరించి నైవేద్యంగా సమర్పించారు. షీలానగర్ ఎస్బీఐఎల్‌లో బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారిని దర్శించేందుకు వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. ఆలయంలో ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని వేదపండితులు అధిష్ఠింపజేసి సహస్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు పాలక మండలి సభ్యులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

పెదగంట్యాడ: ఇక్కడి గరుడాద్రిపై వెలసిన



పెదగంట్యాడ గరుడాద్రిపై తులసీదళాలతో పూజలు

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శ్రీవారికి తులసి దళాలతో వేదపండితులు చామర్తి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లిముక్కు రామాలయంలో నిర్వాసిత కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. గ్రామ పెద్దలు పులి వెంకటరమణారెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, నామాల శ్రీకాంత్, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. శేషపాన్పుపై ప్రత్యేక అలంకరణలో శ్రీవారు సేదతీరుతున్నట్టు ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. అలాగే 98వ వార్డు పరిధి భరత్‌నగర్ సమీప శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో గల శ్రీగోపీజనవల్లభస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు సామూహిక భగవద్గీత పారాయణం చేశారు.

పెందుర్తి: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో శ్రీవారికి పూలంగి సేవ నిర్వహించాక నక్షత్ర హారతులిచ్చారు. అర్చకులు మహర్షి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి నివేదన సమర్పించాక భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. వెంకటాద్రికి విచ్చేసిన భక్తులకు ఉచిత రవాణా బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



పెందుర్తి వెంకటాద్రిపై పూజలందుకున్న శ్రీవారు

భక్తి శ్రద్ధలతో జగన్నాథుని తిరుగు రథయాత్ర

అగనంపూడి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రథయాత్ర ఉత్సవాల్లో ఇక్కడి జగన్నాథస్వామి ఆదివారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రద్యుమ్న మందిరంలో కొలువుదీరిన జగన్నాథుడు, సుభద్ర, బలభద్రలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు స్వామివారిని దర్శించుకుని పూలు చేశారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు, లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను చేపట్టారు. మధ్యాహ్నం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్న సమారాధనను ప్రారంభించారు. సాయంత్రం తిరుగు రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిరహించారు. జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రలను రథంపై అధిష్ఠింపజేశారు. పలువురు భక్తులు రథాన్ని లాకేందుకు పోటీపడ్డారు. ఇంద్రద్యుమ్న మందిరం నుంచి అగనంపూడి కూడలి మీదుగా ఆలయం వరకు రథయాత్ర సాగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్,నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఈవో పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడిలో రథయాత్రలో పాల్గొన్న భక్తులు



గవరపాలెం కాలనీలో రథయాత్ర..

పెందుర్తిరూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం సమీప చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో 13 రోజులుగా నిర్వహిస్తున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. చివరి రోజున జగన్నాథస్వామి కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో సాయంత్రం స్వామివారి తిరుగు రథయాత్రను నిర్వహించారు. కృష్ణాలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర దుర్గానగర్, లక్ష్మీపురం, వీరాంజనేయస్వామి ఆలయం, చింతలఅగ్రహారం త్రిమాత ఆలయం, రామాలయం మీదుగా శివాలయం వరకు సాగింది. అక్కడి నుంచి తిరిగి కృష్ణాలయం వరకు యాత్రను కొనసాగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

గాజువాక, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు విశేషమైనవని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలీషా అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం 76వ వార్డులోని ఆయన విగ్రహానికి ఎలీషా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ప్రజలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు పెంటారావు, అప్పారావు, తాతారావు, ముసలయ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పెదగంట్యాడ జంక్షన్‌లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య, ముసలయ్య, మొల్లి పెంటిరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ గాజువాక నియోజకవర్గ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పార్టీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. నాయకులు ఎం.పరదేశి, జి.గురుమూర్తి, రోజారాణి, చినతల్లి, శ్రీనివాసరెడ్డి, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బాబూ జగ్జీవన్‌రామ్ తాను చేపట్టిన పదవులకు వన్నె తెచ్చి నేటి నాయకులకు ఆదర్శంగా నిలిచారని బెల్ హెచ్‌పీవీపీ ఈడీ జి.సుబ్రహ్మణ్యం అన్నారు. బెల్ హెచ్‌పీవీపీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిజిఎం ఎల్.లీల, కార్మిక నాయకులు కొల్లి దేముడు, బాబూరావు, జగన్నాథరావు, మధుసూదన్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. తుంగ్లాం ఎస్సీ కాలనీలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పెదగంట్యాడలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నాయకుడు స్వార్థపూరితంగా ఉండకూడదు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మల్కాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నాయకుడు ప్రజా సేవ చేయాలే తప్పా స్వార్థపూరితంగా వ్యవహరించకూడదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. ఇక్కడి మరిడిమాంబ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం పశ్చిమ నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' పేరుతో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన పార్టీలు సంయుక్తంగా ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా అమలు చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. కూటమి పాలనకు స్వస్తి పలకడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రజలందరినీ నమ్మించి మోసం చేశారని విమర్శించారు. సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు పీవీ సురేష్, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, నాయకులు పి.రామ్మోహన్ రెడ్డి, పిల్లా కనకరాజు, పేడాడ రమణకుమారి, గులిగిందల కృష్ణ, నూకరెడ్డి, గణేష్, దొడ్డి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వుడా ఫేజ్-6 పార్కుల్లో శ్రమదానం

కూర్మన్నపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సేద తీరేందుకు పార్కులు పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో 86వ వార్డు పరిధి వుడా ఫేజ్-6 కాలనీవాసులు పార్కుల్లో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు దామా సుబ్బారావు, అమిరెడ్డి మురళీధరరెడ్డి మాట్లాడుతూ పార్కుల్లోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. రహదారులను చీపుర్లతో శుభ్రపరిచామన్నారు. కాలుష్య నివారణకు అందరూ విధిగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు గోగినేని మల్లికార్జునరావు, గుడ్ల కుమార్, బాలాజీ, వెంకటరావు, బాబూ నాయక్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 74వ వార్డులో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలతో ఆయన మాట్లాడారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు వియ్యపు కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు దువ్వి శ్రీను, జాజుల గంగరాజు, మొల్లి చిన్నోడు, రామకృష్ణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నాశనమైందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ ప్రజలందరి మన్ననలు పొందేలా పాలన సాగిస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. మల్కాపురంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. అభివృద్ధి విషయంలో సీఎం చంద్రబాబు ఎక్కడా రాజీ పడడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్, తెలుగు మహిళ వార్డు అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి, నాయకులు కాకి పోలిరెడ్డి, జయశంకర్, నూకరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై బూత్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, కో-కన్వీనర్లుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు చౌదరి, టెక్నికల్ ఇన్‌చార్జి పల్లా రమణ మాట్లాడుతూ అందరూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, ఎస్.పెంటారావు, రాంబాబు, కృష్ణ, దానయ్య, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే 86వ వార్డు పరిధి తలారివానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు వేగుంట శ్రీనివాస్, గణపతి, రమేశ్, జగదీశ్, సుబ్బయ్య, నాగార్జున, బుజ్జమ్మ, వెంకటేశ్, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్న స్వర్ణాంధ్ర సాధనకు మరో 15 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వ పాలన రాష్ట్రానికి ఎంతో అవసరమని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

పెంటగాన్ రెగ్డ్ సిస్టమ్స్‌తో షిప్‌యార్డు ఎంవోయూ

మల్కాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నేవల్ ప్లాట్‌ఫామ్ కోసం యాంటీ-డ్రోన్ టెక్నాలజీ అండ్ లాంగ్ రేంజ్ ఎన్ఎల్‌వోఎస్ కమ్యూనికేషన్‌పై సహకరించడానికి హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ కంపెనీ పెంటగాన్ రెగ్డ్ సిస్టమ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. షిప్‌యార్డు సముద్ర భద్రత, కమ్యూనికేషన్‌లో అత్యాధునిక పరిష్కారాలతో నావికా నౌకలపై అత్యాధునిక యాంటీ-డ్రోన్ వ్యవస్థలను సంయుక్తంగా అనుసంధానించడానికి శనివారం పెంటగాన్ రెగ్డ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం చేసుకోవడం ద్వారా భవిష్యత్తు యుద్ధ సన్నద్ధత వైపు నిర్ణయాత్మక అడుగు వేసింది. ఈ సందర్భంగా షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ మాట్లాడుతూ అసమాన డ్రోన్ ముప్పులను ఎదుర్కొనడంలో కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ నేవీకి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఈ ఒప్పందంతో రక్షణ సాంకేతికలో ఓ కీలకమైన అడుగు వేసిందని పేర్కొన్నారు. పీఆర్ఎస్ ఇండియా లిమిటెడ్ ఎండీ డాక్టర్ స్వామినాథన్ మణికందన్, తదితరులు పాల్గొన్నారు.

9న ఉక్కు అడ్మిన్ భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ఈ నెల 9న ధర్నా చేపట్టనున్నట్టు ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు. 9న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె చేపట్టనున్న క్రమంలో స్టీల్‌ప్లాంటులో కూడా సమ్మె చేస్తామని ఉక్కు యాజమాన్యానికి కార్మిక సంఘాలు సమ్మె నోటీసు ఇచ్చాయి. గతంలో కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ప్లాంటులో సమ్మె చేస్తామని పేర్కొనగా.. ఆ తరువాత కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెను వాయిదా వేసినప్పటికి ఇక్కడి కర్మాగారంలో మాత్రం సమ్మె చేశారు. మళ్లీ 9న దేశవ్యాప్త సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునివ్వడంతో స్టీల్‌ప్లాంటులో ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మె చేసేందుకు కార్మిక సంఘాలు వెనకడుగు వేస్తున్నాయి. అందువల్ల అడ్మిన్ భవనం ముందు ధర్నా చేయడంతో పాటు నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు విధులకు హాజరవుతారని పలువురు నాయకులు తెలిపారు.

91, 92 వార్డుల్లో కార్డన్ సెర్చ్

గోపాలపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 91, 92వ వార్డుల పరిధిలోని ఇందిరానగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో గోపాలపట్నం పోలీసులు ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీపీ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ప్రతి ఇంట్లో తనిఖీలు జరిపారు. సరైన పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో రెండు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు నిర్వాహకులను అదుపులోకి తీసుకోవడంతో పాటు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు అప్పలనాయుడు, సీహెచ్ రామారావు, సిబంది పాల్గొన్నారు.

డీసీసీబీ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం

ఎన్.ఎ.డి.జంక్షన్ జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా కాలనీలో అంతర్జాతీయ సహకార దినోత్సవంలో భాగంగా ఆదివారం డీసీసీబీ కార్యాలయ ఆవరణతో పాటు పరిసరాలను కోన తాతారావు, తదితరులు శుభ్రం చేసి స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సూచనల మేరకు బ్యాంకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ఉద్యోగులు కూడా సహకరించాలని సూచించారు. బ్యాంకు పరిసరాల్లో ఉన్న చెత్తను చేపుర్లతో ఊడ్చారు. అలాగే అన్ని బ్యాంక్ శాఖల్లో స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో సహకారం సంఘాల రైతులు అవసరాలు తీర్చేవిధంగా కొత్త ప్రణాళికలు చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ, జీఎం శ్రీనివాసరావు, డీజీఎం ఎం.అశోక్‌కుమార్, ఎల్.అప్పలరాజు, ఎం.శ్రీనివాసరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.